

ఆలస్యంగా నడిచిన ఎక్స్‌ప్రెస్ రైలు

● ఐదు గంటలకు పైగా ప్రయాణికుల అవస్థలు

ములకలచెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఐదు గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.58 గంటలకు వచ్చింది. సాంకేతిక కారణాలతో రైలు కాచిగూడలో ఆలస్యంగా బయలుదేరింది. అలాగే మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.30 గంటలకు, కలికిరికి తెల్లవారుజాము 3.49 గంటలకు గాను ఉదయం 8.58 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు గాను ఉదయం 9.12 గంటలకు వెళ్లింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరాల్సిన రైలు ఉదయం 10.29 గంటలకు చేరుకుంది. రైలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కామ్మో.. ఇన్ని అక్రమాలా..!

తోకెన్ ఒకరి పేరిట, పట్టా మరొకరి పేరిట, అనుభవం ఇంకొకరి చేతుల్లో, రిజిస్ట్రేషన్ మరొకరి పేరుతో... పీలేరు జగనన్న కాలనీల్లో వెలుగు చూస్తున్న అక్రమాల చిట్టా ఇది. 'సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్'తో ఎంతో పారదర్శకంగా, పకడ్బందీగా ఇళ్లు, ఇంటి పట్టాలు మంజూరు చేశామని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకుల మాటల్లో డొల్లతనం వారం రోజులుగా జగనన్న కాలనీల్లో జరుగుతున్న విచారణ సందర్భంగా వెలుగు చూస్తున్న అక్రమాలు రుజువు చేస్తున్నాయి.


● పీలేరు జగనన్న కాలనీల్లో అక్రమాల వింతలెన్నో...

● నోరెళ్లబెడుతున్న విచారణ బృందాలు

● ఆందోళనలో అక్రమార్కులు, కొనుగోలుదారులు

● వైసీపీ నాయకుల వద్దకు పరుగులు

● విచారణ బృందాలను మచ్చిక చేసుకునేందుకు అక్రమార్కుల పన్నాగాలు



పీలేరులోని ఏపీఐఐసీ-3వ లేఔట్



ఏపీఐఐసీ-2వ లేఔట్‌లో భూమి చదును పనులు ఆపివేస్తున్న విచారణ బృందం

పీలేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని జగనన్న కాలనీలో గత పాలకులు, అధికారులు చేసిన పాపాలు బయటపడుతున్నాయి. కాలనీల్లో ఇన్ని అక్రమాలు జరిగాయా, వీటిని ఎప్పుడు అరికట్టడం, అనర్హులు,అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్లాట్లను ఎలా స్వాధీనం చేసుకోవడం అంటూ రెవెన్యూ అధికారులు నోరెళ్లబెడుతున్నారు. 'ఎంక్వైరీ చేయమంటే ఏదో అనుకున్నాం గానీ తేనెపట్టును కదిలించి పొరపాటు చేశామా' అంటూ వారు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఇలా మదనపడుతుంటే వైసీపీ నేతలు మాత్రం వారికి ఫోన్లు చేసి తాము 'స్వంత అవసరాలు, స్వంత మనుషుల' కోసం కొన్ని ప్లాట్లు అట్టిపెట్టుకున్నామని వాటివైపు వెళ్లొద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. విచారణ బృందాల్లోని సభ్యులు గతంలో పనిచేసిన ప్రాంతాలకు చెందిన తమ స్నేహితుల ద్వారా వారికి ఫోన్లు చేయిస్తున్నారు. తిలా పాపం, తలా పిడికెడు అన్నట్లు అప్పటి అధికార పార్టీ నేతలకు తోడు అప్పట్లో పీలేరులో పనిచేసిన అధికారులు కూడా తాము తక్కువ తినలేదంటూ తమ ఖాతాలో కొన్ని ప్లాట్లు పెట్టుకున్నామని వాటిని వదిలేయాలని విచారణ చేస్తున్న సిబ్బందికి ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో తమ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందంగా తయారైందని విచారణ బృందాల సభ్యులు వాపోతున్నారు. ఇక కాలనీల్లో తమ అధికార బలంతో ప్లాట్లు ఆక్రమించుకున్న వారు, వైసీపీ నాయకుల దగ్గర ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళనకు గురవుతున్నారు. తమ పరిస్థితి ఏమిటని పలువురు కొనుగోలుదారులు ఇప్పటికే వైసీపీ నాయకులను నిలదీసినట్లు తెలిసింది. చోటా మోటా నాయకుల దగ్గర నుంచి మండల స్థాయి ప్రజాప్రతినిధులు సైతం అప్పట్లో ప్లాట్లను అమ్ముకున్నారన్న వదంతులు వినిపిస్తున్నాయి.

పట్టా ఒకరి పేరిట..అనుభవంలో మరొకరు

పీలేరు పట్టణంలోని జగనన్న కాలనీల్లో అధికారులు జరిపిన విచారణలో విస్తుగొలిపే కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. కాలనీల్లో కేవలం అప్పటి అధికార పార్టీ నాయకులు మాత్రమే అక్రమాలకు పాల్పడలేదని, లేఔట్‌ల ఏర్పాటు సమయంలో పీలేరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేసిన సిబ్బంది కూడా తమ చేతివాటం ప్రదర్శించారనే నిజాలు కూడా తెలిశాయి. తమ వద్ద ఉన్న రికార్డులు పట్టుకుని విచారణకు వెళ్లిన అధికారులకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు అర్థం కావడం లేదు. రెవెన్యూ రికార్డుల్లో ఒకరి పేరు ఉంటే క్షేత్రస్థాయిలో మరొకరు ఆ ప్లాటు తమదని వస్తున్నారు. ఒకే లక్కీ డిప్ టోకెన్ నెంబరుతో ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులు ప్రత్యక్షమవుతున్నారు. టోకెన్‌లను నిర్ధారించుకునే లోపు పట్టాలు చూపిస్తున్నారు. పట్టాలను సరిపోల్చుకునేలోపు తమకు జరిగిన రిజిస్ట్రేషన్ పత్రాలు చూపుతున్నారు. ఒకే ప్లాట్ నెంబరుకు రెండు రిజిస్ట్రేషన్‌లు జరిగిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయని, వాటి వివరాలను తహసీల్దారుకు తెలియజేశామని కొంతమంది బృంద సభ్యులు తెలిపారు. దీంతో ఏం చేయాలో పాలుపోక విచారణ బృంద సభ్యులు తలలు పట్టుకుంటున్నారు. మరి కొంత మంది వద్ద ఏ ఆధారమూ లేకపోయినా పునాదులు తీసేసుకున్నారు. ఆ ప్లాట్లు మీకు ఎవరు చూపించారని ప్రశ్నించిన అధికారులకు వారు గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, అప్పటి అధికార పార్టీ నేతల పేర్లు చెబుతున్నట్లు తెలిసింది. వారికి అంతో ఇంతో సమర్పించుకుని వారి వద్ద నుంచి ప్లాటు నెంబరు తీసుకున్నామని, ఇప్పుడు కాదంటే తాము అన్యాయమైపోతామని వారు విచారణ బృందాలను వేడుకుంటున్నారు. ఆయా కాలనీల్లో కొన్నిచోట్ల విచారణ బృందాలు కొన్ని అక్రమ నిర్మాణాలను ఆపివేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 12 వేల ఇళ్ల పట్టాల్లో సగానికి సగం అనర్హుల చేతుల్లో ఉన్నట్లు బహిర్గతం అయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



ఏపీఐఐసీ-3వ లేఔట్‌లోని ఆక్రమణలను గతంలో కూల్చివేసిన అధికారులు (ఫైల్)



ఏపీఐఐసీ-3వ లేఔట్‌లో విచారణ చేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

వైసీపీలోనూ గుసగుసలు

జగనన్న కాలనీల్లో వెలుగు చూస్తున్న అక్రమాలపై పీలేరులోని వైసీపీ శ్రేణుల్లోనూ గుసగుసలు మొదలయ్యాయి. తమకు తెలియకుండా నాయకులు అన్ని ప్లాట్లు అమ్ముకున్నారా అంటూ ఆ పార్టీలోని ద్వితీయ, తృతీయ శ్రేణి కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పేరుకు తాము 12 వేల ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకున్నామని, అంత పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినప్పుడు ప్రజలు తమను ఎలా నమ్ముతారని వారిలో వారు ప్రశ్నించుకుంటున్నట్లు తెలిసింది.

ఉన్నతాధికారులకు నివేదిక అందించిన తరువాత చర్యలు..

ప్రస్తుతం కాలనీల్లో విచారణ కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో విచారణ ముగించి, రికార్డులు పరిశీలిస్తున్నాం. పెద్దఎత్తున తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. మా నివేదికను ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేకు అందించి వారి సూచనలు, ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. పూర్తి స్థాయి నివేదిక రావడానికి మరో వారం రోజులు పట్టచ్చు.

- భీమేశ్వరరావు, తహసీల్దారు, పీలేరు

డిసేబుల్డ్ భారత క్రికెట్ జట్టులో శివకోటి

● నేపాల్‌తో టీ20, వన్డే సిరీస్‌లకు నందలూరు వాసి ఎంపిక



భారత జట్టుకు ఎంపికైన శివకోటి

నందలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18 వరకు నేపాల్‌లో జరిగే టీ20, వన్డే సిరీస్‌కు భారత జట్టుకు నందలూరుకు చెందిన శివకోటి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం శివకోటి మాట్లాడుతూ నేపాల్ జట్టుతో నేపాల్‌లో జరిగే టీ20, వన్డే సిరీస్‌లలో భారత జట్టు తరఫున మెరుగైన ప్రదర్శన చేస్తానని, భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలకు వెళతానని తెలిపారు. పుట్టిన ఊరు నందలూరు కీర్తి ప్రతిష్ఠలను దేశం నలుమూలల గుర్తుండిపోయేలా చాటుతానని చెప్పారు. భారత జట్టులో తన ఎంపికకు సహకరించిన బోర్డ్ ఆఫ్ ఇండియన్ డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్‌కు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌తో పాటు తనకు సహకరించిన అందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిధులున్నా నత్తనడకనే..

● నగరవనంలో నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో...

● ఏడాదిన్నరగా కొనసాగుతున్న పనులు

● ఇంకా ప్రారంభం కాని ఆర్కిటెక్ట్ పనులు

6



మదనపల్లెలోని నగరవనం ప్రవేశద్వారం

మదనపల్లె ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

● రైతును హత్య చేశారని అనుమానం వ్యక్తం చేస్తే పోలీసులు కేసు కట్టరా?

● ఆస్పత్రి వద్ద నిరసనకు దిగిన బాస్, బీఎస్పీ నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బుధవారం ఉదయం బాస్, బీఎస్పీ నాయకులు ఆందోళనకు దిగారు. ఎస్సీ రైతును హత్య చేసి చెట్టుకు ఉరి తీశారన్న అనుమానం ఉందని కేసు కట్టమని చెబితే సీఐ నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మదనపల్లె మండలం పొన్నేటిపాలెం గ్రామం పిచ్చలవారిపల్లెలో నరసింహులు అనే ఎస్సీ రైతు తమ పొలానికి దారి సమస్య ఉందని రెడ్డెప్పనాయుడు అనే వ్యక్తిపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిని మనసులో పెట్టుకున్న రెడ్డెప్పనాయుడు రైతు నరసింహులును హత్య చేసి చెట్టుకు వేలాడదీసినట్లు అనుమానం ఉందని తాలుకా సీఐకి మృతుడి భార్య రెడ్డెమ్మ ఫిర్యాదు చేసింది. దానిని పట్టించుకోకుండా సీఐ ఆమెను బెదిరించి నిందితులకు అనుకూలంగా ఆమెతో ఫిర్యాదు చేయించుకున్నారని ఆరోపించారు. ఆందోళన విషయం తెలుసుకున్న తాలుకా సీఐ కళా వెంకటరమణ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు రాగానే బాస్ అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్‌లు ఎస్సీ, ఎస్టీ కేసు, మర్డర్ కేసు కట్టకుండా, నిందితుల పేర్లు చూపకుండా ఎందుకు కేసు కట్టారని నిలదీశారు. దీంతో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మృతదేహాన్ని లోపల ఉంచి మార్చురీ తాళాలు ఎందుకు తీసుకెళ్లారని, అది మీ పని కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐపై చర్యలు తీసుకోవాలని, సీఐని సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం టూటౌన్ సీఐ రామచంద్ర అక్కడికి చేరుకుని మీకు న్యాయం చేస్తాం, మృతదేహాన్ని తీసుకెళ్లండి అని వారికి చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. నరసింహులు మృతికి రెడ్డెప్పనాయుడు కారణమని బుధవారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.



తాలుకా సీఐని నిలదీస్తున్న గౌతమ్‌కుమార్, పీటీఎం శివప్రసాద్, తదితరులు

పల్లెపండుగ వంద శాతం పూర్తి చేయాలి

● వివిధ దశల్లో ఉన్న ఇళ్లు మార్చిలోగా పూర్తి కావాలి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.100 కోట్ల అంచనాతో చేపట్టిన పల్లె పండుగ పనులను ఈనెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పల్లె పండుగ పనులు, ఇళ్ల నిర్మాణ ప్రగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పల్లె పండుగ ద్వారా మంజూరైన పనులు ఎన్ని, పూర్తి చేసినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, అలాగే కొత్తగా మంజూరైన వాటిలో చేపట్టిన పనులు, సాధించిన ప్రగతి అంశాలను సమీక్షించారు. ఇంకా ప్రారంభించని పనులపై ఆయా మండల అధికారులతో కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగతిలో వెనుకబడిన కోడూరు, రాజంపేట, తంబళ్లపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట తదితర మండలాల అధికారులతో సమీక్షించి కారణాలు అడిగి తెలుసుకుని ప్రగతి సాధనకు సూచనలు జారీ చేశారు. పల్లె పండుగ పనులన్నీ ఈ మాసాంతంలోగా పూర్తి చేయాలని, ఎవ్వరూ పనులు పెండింగ్ ఉంచరాదని, పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు బాధ్యత తీసుకుని పనుల పూర్తికి కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే ఎల్ఎల్, ఆర్ఎల్, ఆర్సీ స్థాయిలో ఉన్న ఇళ్లను మార్చి మాసాంతంలోగా పూర్తి చేయడానికి గృహ నిర్మాణ శాఖాధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. లక్ష్యంలో వెనుకబడిన మండలాల్లో ప్రతి బుధవారం హౌసింగ్ ప్రోగ్రాం జరగాలని, ప్రతి శనివారం లేఅవుట్ సందర్శన తప్పనిసరిగా చేస్తే లక్ష్యం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, హౌసింగ్, డీఆర్‌డీఏ, జీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బంక మట్టితో తయారు చేసిన కాడెద్దులు, రైతు



మట్టితో తయారు చేసిన గ్రామీణ పరిసరాలు



పండ్లు, కూరగాయలతో తయారు చేసిన వివిధ రకాల ఆకృతులు

ఆకట్టుకున్న మట్టి కళాకృతులు

● హోరాహోరీగా ఉద్యాన విద్యార్థుల క్రీడా పోటీలు

● అనంతరాజుపేటకు రన్నింగ్, డిస్కస్‌త్రోల్లో బహుమతులు

రైల్వే కోడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల మైదానంలో బుధవారం అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనంతరాజుపేట విద్యార్థులు రన్నింగ్, డిస్కస్‌త్రో పోటీల్లో విజయం సాధించి బహుమతులు అందుకున్నారు. ఈనెల 7న క్రీడలు ముగుస్తాయని అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి పోటీల్లో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు చక్కటి అతిథ్యం ఇచ్చామని తెలిపారు. క్రీడలే కాకుండా రంగోళి, క్లేమోడలింగ్ (మట్టితో కళాకృతులు), వెజిటబుల్ కార్వింగ్‌లను (కూరగాయలతో కళాకృతులు) విద్యార్థులు రూపొందించారన్నారు. సాంస్కృతిక పోటీల్లో మోనో యాక్టింగ్ (ఏకాంకిక), స్కిట్ (లఘు నాటిక), వన్ యాక్ట్ ప్లే (ఏకపాత్రాభినయం) అంశాలలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

పరుగు పందెంలో అనంత విద్యార్థుల విజయం

ఉద్యాన అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. బాలుర 1500 మీటర్ల పరుగు పందెంలో పి.తేజ (అనంతరాజుపేట) మొదటి బహుమతి సాధించాడు. కె.శ్రీనివాస్ (చినలటారావి), విజయకుమార్ (వెంకటరామన్నగూడెం) రెండు, మూడు బహుమతులు సాధించారు. డిస్కస్‌త్రోలో సుప్రియ (అనంతరాజుపేట), చంద్రిక (అనంతరాజుపేట), ఎ.లక్ష్మి (పార్వతీపురం) బహుమతులు సాధించారు. అనంతరాజుపేట, మార్కాపురం జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో అనంతరాజుపేట విద్యార్థులు విజయం సాధించారు. అనంతరాజుపేట, పులివెందుల జట్ల మధ్య నిర్వహించిన బాలికల త్రోబాల్ పోటీల్లో అనంతరాజుపేట జట్టు విజయం సాధించింది.



కబడ్డీ పోటీలో తలపడుతున్న అనంతరాజుపేట విద్యార్థులు

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● సీ, డీ-గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ● ప్రధానోపాధ్యాయుల సదస్సులో డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు సూచించారు. రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల పీసీఆర్ కల్యాణ మండలంలో బుధవారం పదో తరగతి ఫలితాలపై ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రథమస్థానంలో ఉంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రశ్నపత్రాలపై ప్రతి విద్యార్థికి అవగాహన పెంచాలని, అలా పెంచినప్పుడే బాగా చదివి మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. చదువులో వెనుకబడిన సీ, డీ-గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని, ఒత్తిడిని తొలగించడానికి ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేందుకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం షేక్ మహమ్మద్‌హసీం ఆధ్వర్యంలో నిపుణులైన ఉర్దూ ఉపాధ్యాయులు పదో తరగతి ఉర్దూ విద్యార్థుల కోసం తయారు చేసిన అధ్యయన సామగ్రిని అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఐఈడీ కో-ఆర్డినేటర్ జనార్ధన్, జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు.. హాజరైన ప్రధానోపాధ్యాయులు


నగరవనంలో నిర్మించిన పగోడాలు


మదనపల్లెలోని నగరవనం ప్రవేశద్వారం, ఆర్చి

నిధులున్నా నత్తనడకనే...

- నగరవనంలో నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో...
- ఏడాదిన్నరగా కొనసాగుతున్న పనులు
- ఇంకా ప్రారంభం కాని ఆర్కిటెక్ట్ పనులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత ప్రజలకు కాస్త ఆహ్లాదాన్ని, వినోదాన్ని, విశ్రాంతిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నగర వనాల నిర్మాణానికి నిధులు కేటాయించింది. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట పట్టణాల శివారుల్లో నగరవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం ఒక్కో నగరవనం నిర్మాణానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.90 కోట్ల వరకు నిధులు మంజూరు చేసింది. 2023 అక్టోబరు నెలలో మదనపల్లె నగరవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

5.50 ఎకరాల్లో నిర్మాణం

మదనపల్లె పట్టణ శివారులోని పుంగనూరు జాతీయ రహదారి పక్కన ఉన్న అటవీశాఖ స్థలం సోషల్ ఫారెస్ట్‌లో 5.50 ఎకరాల్లో నగరవనం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా నగరవనంలో వాకర్స్ ట్రాక్, పగోడాస్, ఓపెన్ ఎయిర్ సమావేశ హాలు, నగరవనానికి పక్కనే ఉన్న మాదిన కొండపైకి ఎక్కేందుకు ట్రెక్కింగ్ పాత్, కొండపై వ్యూటవర్లు, సెల్ఫీ టవర్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా రూ.1.40 కోట్ల నిధులు మంజూరు కాగా అందులో సివిల్ వర్క్స్, పగోడాల (గుడిసెలు) నిర్మాణం, పర్యాటకుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, వాకింగ్‌పాత్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు గేమింగ్ జోన్ తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటిని సివిల్ కాంట్రాక్టర్‌కు అప్పగించి ఉంటే ఈ పనులన్నీ వేగంగా జరిగిపోయేవి. కానీ అటవీశాఖ అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలోనే ఈ సివిల్ వర్క్స్ నిర్మాణాలు చేపట్టాలని చెప్పడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ పనులు ప్రారంభమై 15 నెలలు గడుస్తున్నా, కేవలం వాకర్స్ పాత్, గేమింగ్ జోన్, మూడు పగోడాలు, రెండు మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. అటవీశాఖ అధికారులు ఒకవైపు దైనందిన విధులు నిర్వహించడం, మరోవైపు నగరవనంలో పనుల పర్యవేక్షణ చేయాల్సి రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అడవుల్లో జంతువుల వివరాలు, వన సంరక్షణ తదితర నైపుణ్యం ఉన్న అటవీశాఖ అధికారులకు సివిల్ వర్క్స్ చేపట్టడంలో నైపుణ్యం లేకపోవడంతో ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది.

సైడ్‌వాల్స్‌తో వాకింగ్ ట్రాక్ నిర్మాణం సరి

మదనపల్లె నగరవనంలో 5.50 ఎకరాల విస్తీర్ణం ఉండటంతో ఈ విస్తీర్ణం చుట్టూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణం కోసం సైడ్‌వాల్స్ నిర్మించారు. 15 అడుగుల వెడల్పుతో 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మించిన వాకింగ్ ట్రాక్ మధ్యలో సన్నకంకర పరచి, వర్షం వస్తే బురద చేరకుండా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. కానీ ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వాకింగ్ ట్రాక్ మధ్యలో వెళుతున్న వంకపై బ్రిడ్జి నిర్మాణానికి సివిల్ ఇంజనీర్ ప్లాన్ తప్పనిసరిగా అవసరం ఉండటంతో ఇక్కడ వాకింగ్ ట్రాక్ పనులు నిలిచిపోయాయి. అంతేకాకుండా నగరవనానికి దక్షిణాన హంద్రీనీవా కాలువ వెళుతుండటం, ఈ కాలువపై నిర్మించిన బ్రిడ్జి కింద కట్ట తెగిపోయి, వర్షపు నీరంతా నగరవనం మీదుగా దిగువకు వెళుతున్నాయి. దీంతో వాకింగ్ ట్రాక్ తెగిపోతోంది. అంతే కాకుండా ఈ వర్షపు నీరు వంకగా మారి నగరవనం సుందరీకరణకు అడ్డుగా మారుతోంది.


తొలి విడతలో రూ.1.40 కోట్ల నిధులు ఖర్చు

మదనపల్లె నగరవనానికి తొలి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.1.40 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఇప్పటి వరకు అవసరమైన స్థలాన్ని చదును చేయడం, ప్రవేశద్వారం, ఆర్చి నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పగోడాలు, గేమింగ్ జోన్, ఇంటర్నల్ పాత్ దారులు, రెండు మరుగుదొడ్లు మాత్రమే నిర్మించారు. నగరవనంకు ఎగువన వున్న హంద్రీనీవా కాలువకట్టకు ఇరువైపులా సుందరీకరణ, నగరవనంలో క్రోటన్స్, పూల మొక్కలు నాటాల్సి ఉంది. అంతేకాకుండా హంద్రీనీవా కాలువకు ఎగువన ఉన్న మాదిని కొండపైకి వెళ్లేందుకు ట్రెక్కింగ్ పాత్, కొండపై వ్యూ టవర్లు, సెల్ఫీ పాయింట్లు నిర్మించాల్సి ఉంది. వీటితో పాటు నగరవనంలో సుందరంగా, ప్రజలను ఆకట్టుకునేలా ఉండేందుకు ఆర్కిటెక్ట్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు అటవీశాఖ సిబ్బంది చేత కాకపోవడంతో బెంగళూరుకు చెందిన ఓ ఆర్కిటెక్స్ సంస్థకు ప్రతిపాదనలు పంపాలని అటవీశాఖ అధికారులు కోరారు. ఈ మేరకు బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు అప్రూవ్ చేయాల్సి ఉంది.

ఆరునెలలుగా అంతంత మాత్రమే పర్యాటకులు

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 50 శాతం మాత్రమే నిర్మాణాలు పూర్తయిన నగరవనాన్ని అప్పటి పాలకులు హడావుడిగా ప్రారంభించేశారు. 2024 మార్చి నెల నుంచి తాత్కాలికంగా నగరవనంలోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఒక్కో పర్యాటకుడి నుంచి పెద్దలకు రూ.20, చిన్నపిల్లలకు రూ.10 చొప్పున టికెట్ వసూలు చేసి లోనికి అనుమతిస్తున్నారు. కాకుంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో రోజుకు కేవలం 50 నుంచి 60 మంది మాత్రమే పట్టణ ప్రజలు నగరవనానికి వస్తున్నారు. సరాసరిన తీసుకుంటే నెలలో కేవలం 1873 మంది మాత్రమే నగరవనాన్ని సందర్శిస్తున్నారు.


సుందరంగా తీర్చిదిద్దిన ఇంటర్నల్‌పాత్


నగరవనం ఆనుకునే ట్రెక్కింగ్ కోసం వున్న మాదినికొండ


నగరవనంలో చిన్నారుల కోసం నిర్మించిన గేమింగ్‌జోన్‌లు

రెండు నెలల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం

మదనపల్లె నగరవనంలో ఇప్పటి వరకు 70 శాతం పనులు రూ.1.40 కోట్లతో పూర్తి చేశాము. మిగిలిన పనులు, ఆర్కిటెక్ట్ పనులు, హంద్రీనీవా కాలువ సుందరీకరణ పనులు, మాదినకొండపైకి ట్రెక్కింగ్‌పాత్, వ్యూపాయింట్, ఆర్కిటెక్ట్ పనులు పూర్తి చేయడానికి రెండో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. ఈ నిధులు విడుదల చేసిన వెంటనే రెండు నెలల్లో అన్ని నిర్మాణ పనులు పూర్తి చేసి, మదనపల్లె ప్రజలకు అందమైన నగరవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

-జి.జే.ప్రసాదరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, మదనపల్లె.

కంటి వైద్యులు కావాలయ్యా..

- పట్టిపీడిస్తున్న సిబ్బంది కొరత
- ఆర్థోపెడిక్ ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి
- ఇదీ వంద పడకల ఆసుపత్రి తీరు


రాయచోటిలోని ఏరియా ఆసుపత్రి

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటై దాదాపు ఏడాది పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. జిల్లా కేంద్రంలో ఏదైనా ప్రమాదం జరిగితే కడప రిమ్స్ లేక తిరుపతి స్విమ్స్ ఆసుపత్రులకు ఇక్కడున్న డాక్టర్లు రెఫర్ చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఈ వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సీ-ఏఆర్ఎంను ఇక్కడ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల అధునాతమైన పరికరాలు ఇక్కడ లేకపోవడం, సంబంధించిన సిబ్బంది కూడా లేకపోవడం వల్లే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నామని ఇక్కడ సిబ్బంది చెప్పుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటైనప్పటి నుంచి కంటి డాక్టర్ పోస్టుల భర్తీ చేయడం లేదని డాక్టర్లు చెబుతున్నారు. జనవరి నెలలో దాదాపు 23,165 ఓపీలో పేషెంట్లు ట్రీట్మెంట్ తీసుకున్నట్లు లెక్కలు ఉన్నాయి. అంతేగాక ఇన్‌పేషెంట్లు 1156, సర్జరీస్ 54, డెలివరీస్ 96, ఎక్స్‌రే 1099, అల్ట్రా సౌండ్ 611, ఈసీజీ 479, ల్యాబ్ టెస్టింగ్ 16,767 మందికి చికిత్సలు అందించినట్లు సిబ్బంది తెలిపారు. అయితే ఇక్కడ ఎముకలు విరిగితే కట్టడానికి కావాల్సిన పరికరాలు, డాక్టర్లు అందుబాటులో లేరని వారు తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఐసీయూ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని వారు తెలిపారు.



కంటి డాక్టర్ లేక తాళం వేసిన రూము

ప్రతిపాదనలు పంపించాం

వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి, కంటి డాక్టర్లు భర్తీ చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. కంటి వ్యాధి నిపుణులు ఇక్కడ లేకపోవడం వాస్తవమే. నీటి వసతి కూడా ఇక్కడ సరిగ్గా లేదు. త్వరలో ఐసీయూకు ప్రతిపాదనలు మంత్రి ఆదేశాలతో పంపించడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

- డేవిడ్ సుకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఇక్కడ బాగానే చూస్తున్నారు



నాకు రెండు రోజుల నుంచి జలుబు, జ్వరం ఎక్కువగా ఉంటే ఇక్కడికి వచ్చి చూపించుకుంటున్నాను. బాగానే చూస్తున్నారు. నేను ఎప్పుడూ ఈ ఆసుపత్రికి రాలేదు. ఇప్పుడు మొదటిసారిగా ఇక్కడికి వచ్చాను. ఈ ఆసుపత్రిలో మందులు కొరతగా ఉందని మాకు చెబుతున్నారు. పారాసిటిమాల్, లివో సిటిజన్ యాంటీబయాటిక్ టాబ్లెట్స్ ఇచ్చారు. దీంతో మీ జబ్బు నయమైపోతుందని డాక్టర్లు చెప్పారు. గతంలో కంటే ఇప్పుడు డాక్టర్లు మంచిగా చూసి మంచి మందులు రాసిస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చాను.

- పద్మావతి, రాయచోటి

ఆర్థోపెడిక్ విభాగం ఏర్పాటు చేయాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రాయచోటి



జిల్లా కేంద్రంలో ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఈ ప్రాంతానికి దాదాపు పది మండలాలకు సంబంధించిన వారు నిత్యం రాయచోటి పట్టణానికి వచ్చి వారి కార్యక్రమాలు చూసుకుని వెళుతూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే డాక్టర్లు కడపకు లేక తిరుపతికి రెఫర్ చేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం ఉండే ఆసుపత్రి ఆచార సంప్రదాయాలు ఇంకా కొనసాగడం దురదృష్టకరం. వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ హాస్పిటల్ పెట్టి కొత్త డాక్టర్లను నియమిస్తే ఇక్కడి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని మేము భావిస్తున్నాం. గతం కంటే ఇప్పుడు డాక్టర్లు అక్కడున్నటువంటి సిబ్బంది బాగానే చూస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో
గృహోపకరణాలు దగ్ధం


దగ్ధమైన వస్తువులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరు క్వార్టర్స్‌లోని దిన్నెపాటి రామక్క ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మత్‌ఖాన్ తెలిపారు. రామక్క ఇటీవలే పక్కా గృహం నిర్మించుకుందని, కులవృత్తిలో భాగంగా దుస్తులు ఉతకడానికి వాగు వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లో మంటలు అంటుకుని బియ్యం, మంచం, బీరువా, నగదు , వస్తువులు ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. గ్రామస్తులు మంటలను అదుపు చేశారని ఆయన తెలిపారు. ఈయన వెంట వీఆర్‌వో వెంకటసుబ్బారెడ్డి, వీఆర్‌ఏలు ఉన్నారు.

తోటలపై ఏనుగుల దాడి


ఏనుగులు తొక్కేసిన టమోటా తోట


రాతి కంచెను ధ్వంసం చేసిన దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం రాత్రి డాక్టర్ నాయుని జనార్దన్‌రెడ్డి మామిడి తోటలో ఏనుగులు ప్రవేశించి అక్కడ సాగు చేసిన టమోటా తోటను ధ్వంసం చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. పైపులైన్, గేట్ వాల్వులను విరిచేశాయన్నారు. ఏనుగుల బారి నుంచి పైర్లను కాపాడడంతో పాటు, నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. నష్టం వివరాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఫారెస్టు అధికారులు తెలిపారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు తెలియజేయండి
- అన్నమయ్య పోలీసు వాట్సప్ ఛానల్ ప్రారంభం
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా, రోడ్డు, మహిళల భద్రత, బాల్యవివాహాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాలు, క్రికెట్ బెట్టింగ్, సైబర్ క్రైం, వైట్‌కాలర్ నేరాలపై అవగాహనతో పాటు జిల్లా పోలీసు వార్తల కోసం వాట్సప్ ఛానల్‌ను ప్రారంభించామని తెలిపారు. మీ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలను వాట్సాప్ ఛానల్ ద్వారా అప్రమత్తం చేస్తూనే ఉంటుందని, ప్రతి ఒక్కరూ మా ఛానల్ ద్వారా ప్రసారం అవుతున్న కార్యక్రమాలను వీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌లపై క్లిక్ చేయవద్దని తెలిపారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనాలను నడపడమే కాకుండా కారులో ప్రయాణించేవారు. తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల నుంచి దూరంగా ఉండడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు కాల్ చేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, బాల్యవివాహాల గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని, బెట్టింగ్‌లో పాల్గొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మీ వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేయవద్దని, గుర్తు తెలియని లింక్‌లపై క్లిక్ చేయడం మంచిది కాదని, ఓటీపీల గురించి జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అన్నమయ్య పోలీసు' వాట్సప్ ఛానల్‌ను, మీరు మీ కుటుంబ సభ్యులు ఫాలో అవుతూ జిల్లాలో ఆండ్రాయిడ్ (ఇంటర్నెట్) వాడుతున్న ప్రతి ఒక్కరి మొబైల్‌లో పోలీసు ఛానల్ ఉండేలా లింకును మీ పరిధిలోని ప్రతి ఒక్కరికీ పంపించేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులకు మన ఛానల్ లింక్ వెంటనే చేరేలా చేయటం మీ బాధ్యత అన్నారు. ఈ బాధ్యత ఒక యజ్ఞంలా కొనసాగాలని, ఇది ఒక టాస్క్ అని ఎస్పీ పోలీసు యంత్రాంగానికి పిలుపునిచ్చారు.


ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



చిరుతపులి మృతకళేబరం వద్ద రైతుతో మాట్లాడుతున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

విద్యుదాఘాతంతో చిరుత మృతి

లింగాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అడవిపందుల బెడద నుంచి పంటను కాపాడుకోవడానికి తీసిన విద్యుత్ తీగకు తగిలి చిరుతపులి మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన దేవిరెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి అడవి పందుల నుంచి శనగ పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడన్నారు. నాలుగు రోజుల క్రితం అటుగా వచ్చిన చిరుతపులి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిందన్నారు. అయితే రైతు చిరుతపులిని సమీపంలోని కొండలో పూడ్చిపెట్టాడని అన్నారు. దీనికి సంబంధించి తమకు సమాచారం రావడంతో బుధవారం రైతును వెంట తీసుకుని సంఘటన స్థలానికి చేరుకుని చిరుత మృతకళేబరాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామన్నారు. కాగా.. ఈ ప్రాంతంలో చిరుతపులి సంచారం ఇదే మొదటిసారి అని స్థానికులు తెలిపారు. తమ పొలాలకు అడవిపందుల బెడద ఎక్కువగా ఉందని, చిరుత సంచారం మాత్రం ఇప్పుడే వెలుగులోకి వచ్చిందని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



చందు (ఫైల్)

వల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండల పరిధిలోని రామిరెడ్డికొట్టాలు సమీపంలో కడప-తాడిపత్రి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చందు (18) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కమలాపురం వాసి చందు అదే కాలనీకి చెందిన రఘునాథ్, బాలు అతని స్నేహితులతో కలిసి సొంత పని నిమిత్తం కడపకు వెళ్లారు. పనిముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా రామిరెడ్డికొట్టాలు వద్ద గొర్రె అడ్డు రావడంతో బైకు అదుపు తప్పిందని, దీంతో బైకు వెనుక భాగంలో కూర్చుని ఉన్న చందు ఒక పక్కకు ఒరిగాడు. అదే సమయంలో కడప వైపు స్కూటరుపై వెళుతున్న వ్యక్తి బైకుతో ఢీకొట్టాడు. ఈప్రమాదంలో చందు తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్ చార్జ్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రసాద్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న వెన్నపూస అఖిల (22) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం సి.చిక్కేపల్లి గ్రామానికి చెందిన పి.చెన్నారెడ్డి, రమణమ్మల చిన్న కుమార్తె అయిన అఖిల బీటెక్ (సీఎస్ఈ) చివరి సంవత్సరం చదువుతోంది. ప్రైవేటు హాస్టల్లో ఉంటున్న అఖిల బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో తన గదికి గడియ పెట్టుకుని చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కొందరు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గదిలోని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు రాజంపేటకు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో చెలరేగిన మంటలు

● ఇంటి సామాగ్రి దగ్ధం ● రూ.లక్షల ఆస్థినష్టం

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిజ్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోయిన ఘటన బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజకాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. త్యాగరాజు కాలనీలో నివాసం ఉంటున్న వనిపెంట వెంకటసుబ్బమ్మ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అదుపు చేసేందుకు ప్రయత్నించి ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించగా, ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసే లోపే ఇంటిలోని విలువైన సామాగ్రి అంతా కాలిపోయింది. దీంతో ఇంట్లో మనవరాలి పెళ్లికోసం తెచ్చి పెట్టుకున్న బంగారు నగలు, పట్టుచీరలు, ఫ్రిజ్, టీవీ, బీరువాలోని బట్టలన్నీ కాలిపోయాయి. ఈఘటనలో దాదాపు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోతున్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో బుధవారం సాయంత్రం తూగుట్లపల్లె చెన్నప్ప (37) అనే వ్యక్తి ఇంటిలో ఫ్యానుకు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల వివరాల మేరకు... చెన్నప్ప డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పాలెం గ్రామానికి చెందిన వరలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. సంక్రాంతి పండుగకు గూడెం చెరువు వద్ద నుంచి అమ్మగారి ఇంటికి వెళ్లిన వరలక్ష్మి తిరిగి రాలేదు. దీంతో మనస్థాపం చెందిన చెన్నప్ప ఇంటిలో తల్లి పుల్లమ్మతో గొడవపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ లింగప్ప పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో చోరీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధి నాగులకట్ట వీధిలోని చౌడేశ్వరీదేవాలయంలో బుధవారం చోరీ జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి గుడిలో ఉన్న అమ్మవారి నాలుగు వెండి హస్తాలు (600 గ్రాములు), శఠారి 400 గ్రాములు, తాళిబొట్టు అరతులం చోరీ చేశారని ఆలయ అధ్యక్షుడు జి.తిరుమలదాసు అర్బన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు : జేసీ

వేంపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోడౌన్లలో డీలర్లకు అందించే బియ్యం బస్తాల్లో, రేషన్‌షాపుల్లో ప్రజలకు ఇచ్చే తూకాల్లో మోసం జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హెచ్చరించారు. తూకాల్లో తక్కువ రాకుండా తనిఖీ చేపట్టాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్, ఇతర అధికారులను ఆదేశించారు. వేంపల్లె బియ్యం గోడౌన్‌ను జేసీ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం చింతలమడుగుపల్లె వద్ద రేషన్ ఎండీయూ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం కత్తలూరు పంచాయతీలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



బియ్యం గోడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

రీసర్వే పక్కాగా చేపట్టాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న రీసర్వే పనులను కచ్చితత్వం వుండేలా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. కొండూరు, చీమలపెంట గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను బుధవారం జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ జంబోరి వేడుకల్లో స్కౌట్ విద్యార్థుల ప్రతిభ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరుచురాపల్లిలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించిన స్కౌట్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకల్లో పాల్గొని ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్ విద్యార్థులను బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు. జంబోరి వేడుకల్లో ప్రతిభ చూపి ఎస్పీ ద్వారా అభినందనలు పొందిన వారిలో సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తరుణ్ కుమార్‌గౌడ్, వీరవెంకటప్రణీత్, నాగచైతన్యరెడ్డి, వెంకటేశ్వర, శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన విద్యార్థులు జాతీయ జంబోరి వేడుకల్లో పాల్గొని ప్రతిభ చూపి జిల్లాకు పేరు తేవడం గర్వకారణంగా ఉందన్నారు. జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతీయ జంబోరి అనేది విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరైన ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఫుడ్ ఎగ్జిబిషన్, మార్చ్‌ఫాస్ట్, యోగా, క్యాంపు ఫైర్ తదితర విభాగాల్లో మన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. అనంతరం డీఆర్‌వో మధుసూదన్‌రావు, డీఈవో సుబ్రమణ్యం, డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ నితిన్‌రెడ్డి, నోబెల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన స్కౌట్ విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

10 నుంచి హరిహరక్షేత్రం బ్రహ్మోత్సవాలు



చెన్నకేశవస్వామి ప్రధాన దేవాలయం



వల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడికాల్వ గ్రామంలో పవిత్ర పాపాఘ్నినది తీరాన వెలసిన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాలను 10వ తేదీ నుంచి వేడుకగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ తెలిపారు. 10న ఉదయం రాక్షసోఘ్న హోమం, వాస్తు హోమాలు, అఘోరరుద్ర, భాద్ర పారాయణాలు, లలితా లక్ష్మి విష్ణు సహస్ర పారాయణం చేస్తామన్నారు. 11న మంగళవారం చండీహోమం, మహామృత్యుంజయహోమం, లక్ష్మినారాయణ హృదయ హోమం, సువర్చలాదేవి సమేత హనుమాన్‌హోమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు సుబ్రమణ్యాహోమం, నాగశాంతి, పరిహార అశ్లేష బలి నిర్వహించి మహామంగళహారతి నిర్వహిస్తామన్నారు. 12న బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా సీతల ఇంద్రాక్షి హోమాలు, ఏకాదశ రుద్ర, సంకల్పిత హోమాలను నిర్వహించి.. మహా పూర్ణాహుతి అనంతరం స్వామివారికి కుంభాభిషేకం ఉ.. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నసంతర్పణ వుంటుందని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా కాలక్షేపం ఉంటాయన్నారు.

న్యాయసేవలను విస్తరింపచేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, ఫిబ్రవరి 5: జాతీయ న్యాయసేవాధికార సంస్థ(నల్సా) అందిస్తున్న పథకాలను, న్యాయసేవలను విస్తరింపచేయాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సభ్యులకు సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నల్సా వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు 1987, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయచట్టం 2015, ఉచిత, నిర్బంధ విద్యకోసం పిల్లల హక్కు చట్టం 2009 తదితర వాటిని తెలుసుకుని వాటిని ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సీనియర్ సిటిజన్స్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు నుంచి కుంభమేళాకు ఆర్టీసీ బస్ టూర్

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నుంచి కుంభమేళాకు ఆర్టీసీ బస్ టూర్‌ను ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ బస్సు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు బస్సు బయలుదేరుతుందన్నారు. అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, పూరి, గయా, బుద్ధగయ, అయోధ్య, వారణాసి, ప్రయాగ తిరిగి పిఠాపురం, సామర్లకోట, విజయవాడ మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంటుందన్నారు. ఈ టూరు పది రోజులు ఉంటుందని ఆ సమయంలో టూరిస్టులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఒక వ్యక్తికి రూ.13500 ధర నిర్ణయించడం జరిగిందన్నారు. టూరుకు రాదల్చినవారు టికెట్ బుకింగ్, మరింత సమాచారం కోసం 7382866916, 9966525210, 7382867512 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాయలసీమలో అత్యంత విలువైన వారసత్వ సంపద

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో అత్యంత విలువైన వారసత్వ సంపద ఉందని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. నేటితరం బాలలకు వారసత్వ సంపద విలువ పట్ల అవగాహన కల్పిస్తేనే దాన్ని రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఇంటెక్ ఆధ్వర్యంలో నగరానికిచెందిన విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో అపురూపమైన వారసత్వ సంపద ఉందని, అందులో మనదేశం ఏమాత్రం తక్కువ కాదని, ప్రధానంగా రాయలసీమలో కూడా ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందన్నారు. దీనిపై అవగాహన కలిగినప్పుడే ఆ సంపదను రక్షించుకోవాల్సిన అవసరం గురించి తెలుస్తుందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ టీవీ సుబ్బారెడ్డి, సభ్యులు కె.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, టెక్నికల్ విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో వీసీ విశ్వనాథ్‌కుమార్, ఇంటాక్ ప్రతినిధులు

దౌర్జన్యంగా శనగ పంట దున్నేశారు

● న్యాయం చేయాలని రైతు ఎస్.నాగసుబ్బారెడ్డి వినతి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో సాగు చేసిన శనగ పంటను ఓ వ్యక్తి దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్నేయడంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు ఎస్.నాగుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన నాగసుబ్బా రెడ్డి జమ్మలమడుగులో బుధవారం సాయంత్రం విలేకరుల ఎదుట జరిగిన నష్టానికి సంబంధించి తెలిపారు. పెద్దపసుపుల గ్రామంలో సర్వే నంబరు 115/1లో తాను 4.23 ఎకరాల్లో శనగ పంట సాగు చేశానన్నారు. ఐదు రోజుల్లో కోత పెట్టాల్సి ఉంది. అంతలోపు శెట్టిపల్లె శ్రీరామరెడ్డి తన పంట పొలంలోకి ట్రాక్టర్ తీసుకొచ్చి దౌర్జన్యంగా దున్నేశారన్నారు. దీంతో తనకు దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ విషయం పెద్దముడియం పోలీసులకు తెలియజేశానన్నారు. మూడు రోజుల నుంచి జమ్మలమడుగు పోలీసు స్టేషన్, రూరల్ సీఐ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరుగలేదని వాపోయాడు. గత అయిదు సంవత్సరాల నుంచి పొలం తగాదా ఉందని.. తమకు న్యాయం చేయాలని బుధవారం సాయంత్రం వెళితే ఎవరూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశాడు. ఈ విషయంపై పెద్దముడియం ఎస్ఐ సుబ్బారావును వివరణ కోరగా.. బాధిత రైతు ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు చేయలేదని.. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



దున్నిన శనగ పంటను చూపుతున్న రైతు నాగ సుబ్బారెడ్డి

వెల్లటూరులో జర్మన్ బృందం పర్యటన

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



రైతులతో మాట్లాడుతున్న విదేశీ ప్రతినిధుల బృందం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జర్మన్ దేశానికి చెందిన జాతీయ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధుల బృందం బుధవారం వెల్లటూరు గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. బృంద సభ్యులు రైతు హరిప్రియ పొలంలో విత్తన గుళికల విధానాన్ని ఉపయోగించి వేసిన అలసంద పంట ప్రయోగాత్మక ప్లాట్‌ను పరిశీలించి ప్రయోజనాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు విత్తిన గుళికల తయారీ విధానాన్ని డెమో పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రైతుసాధికారిక సంస్థ సీనియర్ అధికారులు మురళీధర్ ఏట శివారెడ్డి, డీపీఎం ప్రవీణ్ కుమార్, అదనపు డీపీఎం వసంత కుమారి, విదేశీ బృంద సభ్యులు మార్క్ ప్రెయిన్, సర్వీ నాబుయర్స్, సంగీత అగర్వాల్, అన్నా బెరెజోవ్ స్కాజా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా ఆచార్య ఏజీ దాము



నియామకపత్రాన్ని అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దామును ఫ్యాకల్టీ ఆఫ్‌సైన్సెస్ డీన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య ఏజీ దాముకు ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఇది వరకు డీన్‌గా పనిచేస్తున్న ఆచార్య కృష్ణారెడ్డి పదవీకాలం పూర్తికావడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత, సహ ఆచార్యులు డాక్టర్ వెంకటరామ్ పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఏఈఈ బదిలీ

రామాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసిన ఎల్వీ ప్రసాద్‌రెడ్డి కదిరి ఈస్ట్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ప్రమోషన్ రావడంతో ఆయన బదిలీపై వెళ్లినట్లు మండల విద్యుత్‌శాఖ సిబ్బంది వివరించారు.

రేపు చిన్నమండెం మండల సమావేశం

చిన్నమండెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, ఉపాధి, హార్టికల్చర్ అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. జడ్పీటీసీ , ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే చర్యలు

సంబేపల్లె, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేని వాహనదారులపై చర్యలు తప్పవని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ప్రకాశ్ నగర్ కాలనీ సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని తెలియజేశారు. ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించిప్పుడే సాధ్యమవుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. అతివేగం ప్రమాదకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

చిట్వేలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఇందులో రైల్వేకోడూరు నియోజకవర్గం వసతిగృహంలోని పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సాధికారత అధికారి జయప్రకాష్, కోడూరు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీనివాసమూర్తి విద్యార్థులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్, వసతిగృహ సంక్షేమాధికారులు కిరణ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యకరం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతితో వ్యవసాయం ఆరోగ్యకరమని ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం. మాధవి తెలిపారు. బుధవారం అనంత రాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.యువరాజ్ ఆధ్వర్యంలో ఓబనపల్లె గ్రామంలో ఎస్సీ రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జీవన ఎరువులు, పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూసారం పెరిగి అధిక దిగుబడి పొందవచ్చని రైతులకు సూచించారు. డాక్టర్ శ్రీధర్, సీనియర్ శాస్త్రవేత్త సందీప్ నాయక్, డాక్టర్ వై.యోహన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో నూలివీడుకు చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి లక్ష్మిదేవి, కుమార్తె స్వాతి సౌజన్యంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు.ని డిస్ట్రిక్ చైర్మన్ హరీశ్‌చంద్ర పాల్గొన్నారు.

ఖవ్వాలీ పోటీలు

చిన్నమండెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హజరత్‌షా వలి గంజే సాహిద్‌బాబా రమంతుల్లా అలైమి దర్గా ఉరుసులో భాగంగా మంగళవారం రాత్రి ఖవ్వాలీ పోటీలు నిర్వహించారు. ముస్లింలతోపాటు హిందువులు పాల్గొన్నారు.

మహిళకే 'మార్కెట్ కమిటీ' !

● పావులు కదుపుతున్న నాయకులు ● ఓసీ జనరల్‌కు కేటాయించారని ప్రచారం



రైల్వేకోడూరు మార్కెట్ యార్డు ముఖద్వారం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పలువురు మహిళలు రేసులో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించారు. కూటమి ప్రభుత్వం లో ఓసీ మహిళ కు కేటాయించారు. వివరాల్లోకి వెళితే....ఈ నామినేటెడ్ పదవి కి ఓబులవారిపల్లె మండలానికి చెందిన ఇద్దరు , మైసూరివారిపల్లె జనసేన పార్టీకి చెందిన ఇద్దరితోపాటు మరో మహిళ రేసులో ఉన్నారని తెలిసింది. వీరంతా కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని వేర్వేరుగా కలసి మార్కెట్ కమిటీ పదవి తమకే ఇవ్వాలని కోరినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్ కమిటీ మొదట ఓసీ మహిళకు కేటాయించినట్లు ఓ ప్రకటన విడుదల కాగా, ఓసీ జనరల్ కు కేటాయించారని , ఇంకా అధికార ప్రకటన విడుదల కావాల్సి ఉందని పలువురు అంటున్నారు. ఓసీ మహిళ అయినా, జనరల్ అయినా వీరే కీలకంగా రేసులో ఉంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బాపట్ల ఎన్నికల పరిశీలకుడిగా వెళ్లిన రూపానందరెడ్డి తిరిగి రాగానే అభ్యర్థి విషయం ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయని కూటమి నాయకులు అంటున్నారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని రైల్వేకోడూరు నుంచి గెలిపించామని తమకే చైర్మన్ పదవిని కట్టబెట్టాలని ఆ పార్టీ నాయకులు ముక్కాపై వత్తిడి చేస్తున్నారని తెలిసింది.

లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి : సీఐటీయూ



రైల్వేకోడూరు:ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలంటూ బుధవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రైల్వేకోడూరులో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు అందుకు బదులుగా 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్లను ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించిందన్నారు. మోదీ ప్రభుత్వం వీటిని అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఏనాడైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రీ బడ్జెట్ సమావేశం లో కార్మిక సంఘాల సమక్షంలో ప్రకటించగా వారంతా తీవ్రంగా ఖండించారని గుర్తు చేశారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్ల ముఖ్యఉద్దేశం అన్నారు. ఈ కోడ్లు పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికే అమలు చేస్తున్నారని తెలిపారు. కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా చేసి దోపిడీని మరింత తీవ్రతరం చేయడానికి చేస్తున్న పన్నాగం అని ఆరోపించారు. మూడు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్. వెంకటేష్, విద్యుత్ రెగ్యులర్ యూనియన్, మండల సీఐటీయూ అధ్యక్షుడు సి. పుల్లయ్య, మండల ప్రధాన కార్యద్శి పి. జాన్‌ప్రసాద్, ఏపీఎండీసీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుప్పాల సుబ్రహ్మణ్యం. నాయకులు ఎం. వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె: సంబేపల్లె రెవెన్యూ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా నాయకురాలు సిద్దమ్మ సభ్యులు అనసూయమ్మ, రమణ, కవిత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మంగంపేట పారిశ్రామిక కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదరాజు గంగాధర్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఏఐటీయూసీ నేతలు తుమ్మల కృష్ణచైతన్య, త్రివేణి వెంకటరమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చిన్నమండెం: చిన్నమండెం ప్రభుత్వాసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ , రెడ్డెమ్మ, మేరీ సులోచన, శ్రీలత, సిద్దమ్మ, మునీరా, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాజంపేట :మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మిక నాయకులు సురేష్, ప్రసాద్, బాలాజీ అంగన్వాడీ నాయకులు సారమ్మ, లక్ష్మీదేవి తదితరులు ధర్నా చేశారు.

రాయచోటిటౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామాంజులు, సాంబశివ, ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, సీపీఐ సహాయ కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుల కడుపు కొట్టి.. కార్పొరేట్లకు పెడుతున్నారు

ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులకు నిప్పంటిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతాంగ వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా బుధవారం రాయచోటి పట్టణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం గౌరవాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగా రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతుల కడుపు కొట్టి కార్పొరేట్లకు పరమాన్నం పెట్టిందన్నారు. ఈ బడ్జెట్‌తో వ్యవసాయం మరింత భారమై రైతు కుటుంబాలు అప్పులపాలై ఆత్మహత్యలు పెరిగి పోతాయన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొనే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ నాయుడు, బాలకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్, ఏరియా సభ్యులు రామచంద్రారెడ్డి, వెంకటేశ్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

● చౌడపల్లె వృషభాలకు ప్రథమ బహుమతి



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

నందలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంపిణీపురం భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం నూకినేనిపల్లెకు చెందిన డాక్టర్ గణపతిశంకర్, సంభావు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. కడప జిల్లా చౌడపల్లెకు చెందిన మార్తల చంద్రబాబురెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచి అతిథి కృష్ణ విరాళంగా అందజేసిన 50 వేల నగదు బహుమతిని గెలుచుకున్నాయి. ద్వితీయ స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా వరదాయపల్లెకు చెందిన వృషభాలు 40 వేలు బహుమతిని కైవసం చేసుకున్నాయి. మూడోస్థానంలో మార్తల సూరారెడ్డి వృషభాలు 30 వేలు, నాలుగోస్థానంలో నిలిచిన మార్తల వెంకటసుబ్బారెడ్డి వృషభాలు 20 వేలు , ఐదో స్థానంలో నిలిచిన లింగారెడ్డి శ్రీకాంత్ వృషభాలు 10 వేలు, ఆరో స్థానంలోనిలిచిన పసుపులేటి రమణయ్య వృషభాలు 7 వేల రూపాయలు, ఏడో స్థానంలో వెంకటేష్ వృషభాలు 5 వేల రూపాయలను అందుకున్నాయి. గుత్తికి చెందిన నారాయణస్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రాత్రి కుంపిణీపురం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ



చిట్వేలి: గట్టుమీద పల్లెలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



బోయనపల్లెలో సిమెంటురోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

చిట్వేలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాయపాలెం పంచాయతీ గట్టుమీద పల్లెలో 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, రోడ్లు, కరెంటు, నీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి నరసింహ, గట్టుమీదపల్లె గ్రామస్థులు మన్నూరు వెంకటేశ్, నాగేష్, రియాజ్, పెంచలయ్య, మాదాసు నరసింహ, నాగేశ్వరరావు, హరిప్రసాద్, మండల స్థానిక కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయనపల్లెలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం గ్రామీణప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటోందన్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, రాష్ట్ర బీసీ నాయకులు ఇడిమడకల కుమార్, చమర్తి మహేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

చిట్వేలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని తుమ్మచెట్లపల్లె గ్రామ శివారులో మంగళ వారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని 12 ఎర్రచందనం దుంగలు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలియజేశారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లుకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ రఘురాం, సిబ్బందితో కలిసి తుమ్మచెట్లపల్లె శివారులోని పొలం వద్ద ట్రాక్టరులోకి దుంగలను లోడ్ చేస్తుండగా తుంగ చరణ్, రైల్వేకోడూరు మండలానికి చెందిన కుంబా వెంకటరమణ(35), తోటకొండ నాగేంద్ర(48)ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం 278 కిలోలు ఉంటుందని, దీని విలువ 4 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడమైందని వివరించారు. ఈ దాడుల సందర్భంగా మరి కొందరు నిందితులు పారిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెచ్‌సీలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. బాధితులు అందించిన సమాచారం మేరకు పట్టణంలోని వడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు, మణి, గణేష్ మరి కొంతమందితో కలిసి పందెం కోడి మాంసం తెచ్చుకుని మద్యం సేవిస్తూ ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో శ్రీనివాసులపై మణి దాడి చేశాడు. గ్రామంలోని పెద్దలు వారికి నచ్చజెప్పి అక్కడ నుండి పంపించారు. ఈ సమాచారం తెలుసుకున్నా శ్రీనివాసులు అల్లుడు రాకేష్ బుధ గుంటపల్లె నుంచి తన స్నేహితులతో కర్రలు బీరు సీసాలతో గణేష్, మణి తదితరులపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా బాలింత గాయపడింది. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.హేమసుందర్ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● వీఆర్వోలపై ఆర్డీవో ఆగ్రహం

సిద్దవటం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారంటూ పెద్దపల్లి, జ్యోతి, టక్కోలి గ్రామ వీఆర్వోలపై కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే వేతనాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి, టక్కోలి గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారంపై వీఆర్వోలు గంగన శ్యాంబాబు, సంటయ్య నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ తమకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శంకరయ్య, మండల ఇన్‌చార్జి తహశిల్దారు మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ప్రసాద్‌బాబు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

'బలహీనుల హక్కులకు రక్షణ కవచం రాజ్యాంగం'



సదస్సులో మాట్లాడుతున్న ఈశ్వర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బలహీనుల హక్కులకు రక్షణ కవచంగా భారత రాజ్యాంగం నిలుస్తోందని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య - కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో రాజ్యాంగంపై చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా టీ. ఈశ్వర్ మహిళా హక్కులు, మహిళలపై దాడులపై అవగాహన కల్పిం చారు. ఐఏఎల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగముని దళితులపై వివక్ష ప్రదర్శించినా, దాడులు చేసినా కఠిన శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ఐఏఎల్ జిల్లా మరో సభ్యుడు రవిశంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగేశ్వర్, వరలక్ష్మి, శివకుమార్, హరీష్, కిరణ్, ప్రదీప్‌కుమార్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

నందలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నేల, నీరు, గాలి మనకు ప్రకృతి ప్రసాదించిన వరాలని, వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మీసరగండ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగి రెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాజంపేట రీజియన్ కోఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరు పర్యావరణంపై అవగాహన పెంపొందించుకుని సహజ వనరులను కాపాడుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఎన్జీసీ కోఆర్డినేటర్ శిల్పి ఆనందాచారి ఆధ్వర్యంలో జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, గౌరీ, తులసి, స్వర్ణలత, బోగా వెంకటసుబ్బయ్య, మస్తాన్, జ్యోతి, ప్రియ, గీతా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

9న పుల్లంపేటలో కంటి వైద్య శిబిరం

పుల్లంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9న స్థానిక ఎస్‌బీవీడీ సభ హైస్కూల్ క్రీడా మైదానంలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కడప అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

విద్యుద్దీపాల ఏర్పాటు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని ఓబులవారిపల్లె క్రాస్, బొమ్మవరం క్రాస్ వద్ద, గోవిందంపల్లె క్రాస్, మంగం పేట చెన్నకేశవస్వామి గుడి పరిస రాల్లో ఎస్ఐ మహేష్ విద్యుత్ దీపా లను ఏర్పాటు చేయించారు. ఆయా ప్రాంతాల్లో చీకటిగా ఉండడంతో రాత్రి వేళల్లో బస్సు దిగి వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రాత్రి వేళ గస్తీ నిర్వహించే పోలీసులు ఈ విషయం ఎస్ఐ మహేష్‌కు తెలియజేయగాదాతల సహాయంతో ఆయన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వలి తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం




పూర్వ ప్రాథమిక విద్యపై వివరిస్తున్న సీడీపీవో నిర్మలా జ్యోతి

పెనగలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):పౌష్టికాహారంతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో నిర్మలా జ్యోతి తెలిపారు. బుధవారం కోడిచిన్నయ్యగారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త కాలి వి జయమ్మ అధ్యక్షతన ఈసీసీఈ కార్యక్రమం నిర్వహించారు. 3 నుంచి 6 ఏళ్ల మధ్య వయసు చిన్నారుల ఎత్తు, బరువు నమోదు చేశారు. ఈ సమావేశంలో ఆమె పూర్వ ప్రాథమిక విద్యపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పెనగలూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.విజయ కుమారి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

రాజంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులు చెల్లించడం సులభ తరం చేస్తూ ఏపీఎస్పీడీ సీఎల్ తీసుకున్న నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యుత్ బిల్లులో క్యూఆర్ కోడ్ వస్తుందని, బిల్లు చెల్లించేటప్పుడు ఫోన్‌పే ద్వారానో, గూగుల్ పే ద్వారానో సంబంధిత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యుత్ బిల్లును సులభంగా చెల్లించవచ్చునన్నారు. విద్యుత్‌శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

శివాలయం హుండీ కానుకలు లెక్కింపు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

చిట్వేలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయం, బ్రాహ్మణ వీధిలోని భక్తాంజనేయ స్వామి ఆలయాల హుండీల్లోని కానుకలను బుధవారం అధికారులు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. శివాలయంలో 4,01,430 రూపాయలు భక్తాంజనేయ స్వామి ఆలయంలో 32,475 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో కొండారెడ్డి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సిబ్బంది లక్ష్మయ్య, కమిటీ సభ్యులు వీరాంజనేయరాజు, నాగేశ్వరరావు, మోహన్, గోపాల్, సురేంద్రరెడ్డి, కట్టా రామయ్య, ఆలయ పూజారి నాగ పవన్, శ్రీనివాసులరెడ్డి, ఇరసారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లౌకిక విలువలను కాపాడాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హిందువులు నివాసం ఉన్న ప్రాంతంలో ఇతర మతానికి చెందిన ప్రార్థన మందిరాన్ని ఏర్పాటు చేసి తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు హిందూ చైతన్యవేదిక సృజనకుమార్ బుధవారం లక్కిరెడ్డిపల్లెలో శాంతియుత ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 870లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం ప్రార్థన మందిరాలు ఏర్పాటు చేయడం మంచిదికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకటరామ రాజు, సురేష్, నరసింహులు, ఉష, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


నగరవనంలో నిర్మించిన పగోడాలు


మదనపల్లెలోని నగరవనం ప్రవేశద్వారం, ఆర్చి

నిధులున్నా నత్తనడకనే...

- నగరవనంలో నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో...
- ఏడాదిన్నరగా కొనసాగుతున్న పనులు
- ఇంకా ప్రారంభం కాని ఆర్కిటెక్ట్ పనులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత ప్రజలకు కాస్త ఆహ్లాదాన్ని, వినోదాన్ని, విశ్రాంతిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నగర వనాల నిర్మాణానికి నిధులు కేటాయించింది. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట పట్టణాల శివారుల్లో నగరవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం ఒక్కో నగరవనం నిర్మాణానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.90 కోట్ల వరకు నిధులు మంజూరు చేసింది. 2023 అక్టోబరు నెలలో మదనపల్లె నగరవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

5.50 ఎకరాల్లో నిర్మాణం

మదనపల్లె పట్టణ శివారులోని పుంగనూరు జాతీయ రహదారి పక్కన ఉన్న అటవీశాఖ స్థలం సోషల్ ఫారెస్టులో 5.50 ఎకరాల్లో నగరవనం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా నగరవనంలో వాకర్స్ ట్రాక్, పగోడాస్, ఓపెన్ ఎయిర్ సమావేశ హాలు, నగరవనానికి పక్కనే ఉన్న మాదిన కొండపైకి ఎక్కేందుకు ట్రెక్కింగ్ పాత్, కొండపై వ్యూటవర్లు, సెల్ఫీ టవర్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా రూ.1.40 కోట్ల నిధులు మంజూరు కాగా అందులో సివిల్ వర్క్స్, పగోడాల (గుడిసెలు) నిర్మాణం, పర్యాటకుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, వాకింగ్‌పాత్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు గేమింగ్ జోన్ తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటిని సివిల్ కాంట్రాక్టర్‌కు అప్పగించి ఉంటే ఈ పనులన్నీ వేగంగా జరిగిపోయేవి. కానీ అటవీశాఖ అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలోనే ఈ సివిల్ వర్క్స్ నిర్మాణాలు చేపట్టాలని చెప్పడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ పనులు ప్రారంభమై 15 నెలలు గడుస్తున్నా, కేవలం వాకర్స్ పాత్, గేమింగ్ జోన్, మూడు పగోడాలు, రెండు మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. అటవీశాఖ అధికారులు ఒకవైపు దైనందిన విధులు నిర్వహించడం, మరోవైపు నగరవనంలో పనుల పర్యవేక్షణ చేయాల్సి రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అడవుల్లో జంతువుల వివరాలు, వన సంరక్షణ తదితర నైపుణ్యం ఉన్న అటవీశాఖ అధికారులకు సివిల్ వర్క్స్ చేపట్టడంలో నైపుణ్యం లేకపోవడంతో ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది.

సైడ్‌వాల్స్‌తో వాకింగ్ ట్రాక్ నిర్మాణం సరి

మదనపల్లె నగరవనంలో 5.50 ఎకరాల విస్తీర్ణం ఉండటంతో ఈ విస్తీర్ణం చుట్టూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణం కోసం సైడ్‌వాల్స్ నిర్మించారు. 15 అడుగుల వెడల్పుతో 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మించిన వాకింగ్ ట్రాక్ మధ్యలో సన్నకంకర పరచి, వర్షం వస్తే బురద చేరకుండా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. కానీ ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వాకింగ్ ట్రాక్ మధ్యలో వెళుతున్న వంకపై బ్రిడ్జి నిర్మాణానికి సివిల్ ఇంజనీర్ ప్లాన్ తప్పనిసరిగా అవసరం ఉండటంతో ఇక్కడ వాకింగ్ ట్రాక్ పనులు నిలిచిపోయాయి. అంతేకాకుండా నగరవనానికి దక్షిణాన హంద్రీనీవా కాలువ వెళుతుండటం, ఈ కాలువపై నిర్మించిన బ్రిడ్జి కింద కట్ట తెగిపోయి, వర్షపు నీరంతా నగరవనం మీదుగా దిగువకు వెళుతున్నాయి. దీంతో వాకింగ్ ట్రాక్ తెగిపోతోంది. అంతే కాకుండా ఈ వర్షపు నీరు వంకగా మారి నగరవనం సుందరీకరణకు అడ్డుగా మారుతోంది.

తొలి విడతలో రూ.1.40 కోట్ల నిధులు ఖర్చు

మదనపల్లె నగరవనానికి తొలి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.1.40 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఇప్పటి వరకు అవసరమైన స్థలాన్ని చదును చేయడం, ప్రవేశద్వారం, ఆర్చి నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పగోడాలు, గేమింగ్ జోన్, ఇంటర్నల్ పాత్ దారులు, రెండు మరుగుదొడ్లు మాత్రమే నిర్మించారు. నగరవనంకు ఎగువన వున్న హంద్రీనీవా కాలువకట్టకు ఇరువైపులా సుందరీకరణ, నగరవనంలో క్రోటన్స్, పూల మొక్కలు నాటాల్సి ఉంది. అంతేకాకుండా హంద్రీనీవా కాలువకు ఎగువన ఉన్న మాదిని కొండపైకి వెళ్లేందుకు ట్రెక్కింగ్ పాత్, కొండపై వ్యూ టవర్లు, సెల్ఫీ పాయింట్లు నిర్మించాల్సి ఉంది. వీటితో పాటు నగరవనంలో సుందరంగా, ప్రజలను ఆకట్టుకునేలా ఉండేందుకు ఆర్కిటెక్ట్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు అటవీశాఖ సిబ్బంది చేత కాకపోవడంతో బెంగళూరుకు చెందిన ఓ ఆర్కిటెక్స్ సంస్థకు ప్రతిపాదనలు పంపాలని అటవీశాఖ అధికారులు కోరారు. ఈ మేరకు బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు అప్రూవ్ చేయాల్సి ఉంది.

ఆరునెలలుగా అంతంత మాత్రమే పర్యాటకులు

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 50 శాతం మాత్రమే నిర్మాణాలు పూర్తయిన నగరవనాన్ని అప్పటి పాలకులు హడావుడిగా ప్రారంభించేశారు. 2024 మార్చి నెల నుంచి తాత్కాలికంగా నగరవనంలోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఒక్కో పర్యాటకుడి నుంచి పెద్దలకు రూ.20, చిన్నపిల్లలకు రూ.10 చొప్పున టికెట్ వసూలు చేసి లోనికి అనుమతిస్తున్నారు. కాకుంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో రోజుకు కేవలం 50 నుంచి 60 మంది మాత్రమే పట్టణ ప్రజలు నగరవనానికి వస్తున్నారు. సరాసరిన తీసుకుంటే నెలలో కేవలం 1873 మంది మాత్రమే నగరవనాన్ని సందర్శిస్తున్నారు.


సుందరంగా తీర్చిదిద్దిన ఇంటర్నల్‌పాత్


నగరవనం అనుకునే ట్రెక్కింగ్ కోసం వున్న మాదినికొండ


నగరవనంలో చిన్నారుల కోసం నిర్మించిన గేమింగ్‌జోన్‌లు

రెండు నెలల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం

మదనపల్లె నగరవనంలో ఇప్పటి వరకు 70 శాతం పనులు రూ.1.40 కోట్లతో పూర్తి చేశాము. మిగిలిన పనులు, ఆర్కిటెక్ట్ పనులు, హంద్రీనీవా కాలువ సుందరీకరణ పనులు, మాదినకొండపైకి ట్రెక్కింగ్‌పాత్, వ్యూపాయింట్, ఆర్కిటెక్ట్ పనులు పూర్తి చేయడానికి రెండో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. ఈ నిధులు విడుదల చేసిన వెంటనే రెండు నెలల్లో అన్ని నిర్మాణ పనులు పూర్తి చేసి, మదనపల్లె ప్రజలకు అందమైన నగరవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

-జి.జే.ప్రసాదరావు,
ఫారెస్ట్ రేంజ్ అధికారి, మదనపల్లె.

కంటి వైద్యులు కావాలయ్యా..

- పట్టిపీడిస్తున్న సిబ్బంది కొరత
- ఆర్థోపెడిక్ ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి
- ఇదీ వంద పడకల ఆసుపత్రి తీరు

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటై దాదాపు ఏడాది పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. జిల్లా కేంద్రంలో ఏదైనా ప్రమాదం జరిగితే కడప రిమ్స్ లేక తిరుపతి స్విమ్స్ ఆసుపత్రులకు ఇక్కడున్న డాక్టర్లు రెఫర్ చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఈ వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సీ-ఏఆర్ఎంను ఇక్కడ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల అధునాతమైన పరికరాలు ఇక్కడ లేకపోవడం, సంబంధించిన సిబ్బంది కూడా లేకపోవడం వల్లే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నామని ఇక్కడ సిబ్బంది చెప్పుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటైనప్పటి నుంచి కంటి డాక్టర్ పోస్టుల భర్తీ చేయడం లేదని డాక్టర్లు చెబుతున్నారు. జనవరి నెలలో దాదాపు 23,165 ఓపీలో పేషెంట్లు ట్రీట్మెంట్ తీసుకున్నట్లు లెక్కలు ఉన్నాయి. అంతేగాక ఇన్‌పేషెంట్లు 1156, సర్జరీస్ 54, డెలివరీస్ 96, ఎక్స్‌రే 1099, అల్ట్రా సౌండ్ 611, ఈసీజీ 479, ల్యాబ్ టెస్టింగ్ 16,767 మందికి చికిత్సలు అందించినట్లు సిబ్బంది తెలిపారు. అయితే ఇక్కడ ఎముకలు విరిగితే కట్టడానికి కావాల్సిన పరికరాలు, డాక్టర్లు అందుబాటులో లేరని వారు తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఐసీయూ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని వారు తెలిపారు.


రాయచోటిలోని ఏరియా ఆసుపత్రి



కంటి డాక్టర్ లేక తాళం వేసిన రూము

ప్రతిపాదనలు పంపించాం

వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి, కంటి డాక్టర్లు భర్తీ చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. కంటి వ్యాధి నిపుణులు ఇక్కడ లేకపోవడం వాస్తవమే. నీటి వసతి కూడా ఇక్కడ సరిగ్గా లేదు. త్వరలో ఐసీయూకు ప్రతిపాదనలు మంత్రి ఆదేశాలతో పంపించడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

- డేవిడ్ సుకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఇక్కడ బాగానే చూస్తున్నారు



నాకు రెండు రోజుల నుంచి జలుబు, జ్వరం ఎక్కువగా ఉంటే ఇక్కడికి వచ్చి చూపించుకుంటున్నాను. బాగానే చూస్తున్నారు. నేను ఎప్పుడూ ఈ ఆసుపత్రికి రాలేదు. ఇప్పుడు మొదటిసారిగా ఇక్కడికి వచ్చాను. ఈ ఆసుపత్రిలో మందులు కొరతగా ఉందని మాకు చెబుతున్నారు. పారాసిటిమాల్, లివో సిటిజన్ యాంటీబయాటిక్ టాబ్లెట్స్ ఇచ్చారు. దీంతో మీ జబ్బు నయమైపోతుందని డాక్టర్లు చెప్పారు. గతంలో కంటే ఇప్పుడు డాక్టర్లు మంచిగా చూసి మంచి మందులు రాసిస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చాను.

- పద్మావతి, రాయచోటి

ఆర్థోపెడిక్ విభాగం ఏర్పాటు చేయాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రాయచోటి



జిల్లా కేంద్రంలో ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఈ ప్రాంతానికి దాదాపు పది మండలాలకు సంబంధించిన వారు నిత్యం రాయచోటి పట్టణానికి వచ్చి వారి కార్యక్రమాలు చూసుకుని వెళుతూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే డాక్టర్లు కడపకు లేక తిరుపతికి రెఫర్ చేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం ఉండే ఆసుపత్రి ఆచార సంప్రదాయాలు ఇంకా కొనసాగడం దురదృష్టకరం. వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ హాస్పిటల్ పెట్టి కొత్త డాక్టర్లను నియమిస్తే ఇక్కడి ప్రజలకు ఉయోగకరంగా ఉంటుందని మేము భావిస్తున్నాం. గతం కంటే ఇప్పుడు డాక్టర్లు అక్కడున్నటువంటి సిబ్బంది బాగానే చూస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

రామాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరు క్వార్టర్స్‌లోని దిన్నెపాటి రామక్క ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మత్‌ఖాన్ తెలిపారు. రామక్క ఇటీవలే పక్కా గృహం నిర్మించుకుందని, కులవృత్తిలో భాగంగా దుస్తులు ఉతకడానికి వాగు వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లో మంటలు అంటుకుని బియ్యం, మంచం, బీరువా, నగదు , వస్తువులు ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. గ్రామస్తులు మంటలను అదుపు చేశారని ఆయన తెలిపారు. ఈయన వెంట వీఆర్‌వో వెంకటసుబ్బారెడ్డి, వీఆర్ఏలు ఉన్నారు.


దగ్ధమైన వస్తువులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తోటలపై ఏనుగుల దాడి


ఏనుగులు తొక్కేసిన టమోటా తోట


రాతి కంచెను ధ్వంసం చేసిన దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం రాత్రి డాక్టర్ నాయుని జనార్దన్‌రెడ్డి మామిడి తోటలో ఏనుగులు ప్రవేశించి అక్కడ సాగు చేసిన టమోటా తోటను ధ్వంసం చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. పైపులైన్, గేట్ వాల్వులను విరిచేశాయన్నారు. ఏనుగుల బారి నుంచి పైర్లను కాపాడడంతో పాటు, నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. నష్టం వివరాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఫారెస్టు అధికారులు తెలిపారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు తెలియజేయండి
- అన్నమయ్య పోలీసు వాట్సప్ ఛానల్ ప్రారంభం
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా, రోడ్డు, మహిళల భద్రత, బాల్యవివాహాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాలు, క్రికెట్ బెట్టింగ్, సైబర్ క్రైం, వైట్‌కాలర్ నేరాలపై అవగాహనతో పాటు జిల్లా పోలీసు వార్తల కోసం వాట్సప్ ఛానల్‌ను ప్రారంభించామని తెలిపారు. మీ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలను వాట్సాప్ ఛానల్ ద్వారా అప్రమత్తం చేస్తూనే ఉంటుందని, ప్రతి ఒక్కరూ మా ఛానల్ ద్వారా ప్రసారం అవుతున్న కార్యక్రమాలను వీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌లపై క్లిక్ చేయవద్దని తెలిపారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనాలను నడపడమే కాకుండా కారులో ప్రయాణించేవారు. తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల నుంచి దూరంగా ఉండడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు కాల్ చేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, బాల్యవివాహాల గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని, బెట్టింగ్‌లో పాల్గొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మీ వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేయవద్దని, గుర్తు తెలియని లింక్‌లపై క్లిక్ చేయడం మంచిది కాదని, ఓటీపీల గురించి జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అన్నమయ్య పోలీసు' వాట్సప్ ఛానల్‌ను, మీరు మీ కుటుంబ సభ్యులు ఫాలో అవుతూ జిల్లాలో ఆండ్రాయిడ్ (ఇంటర్నెట్) వాడుతున్న ప్రతి ఒక్కరి మొబైల్‌లో పోలీసు ఛానల్ ఉండేలా లింకును మీ పరిధిలోని ప్రతి ఒక్కరికీ పంపించేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులకు మన ఛానల్ లింక్ వెంటనే చేరేలా చేయటం మీ బాధ్యత అన్నారు. ఈ బాధ్యత ఒక యజ్ఞంలా కొనసాగాలని, ఇది ఒక టాస్క్ అని ఎస్పీ పోలీసు యంత్రాంగానికి పిలుపునిచ్చారు.


ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



చిరుతపులి మృతకళేబరం వద్ద రైతుతో మాట్లాడుతున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

విద్యుదాఘాతంతో చిరుత మృతి

లింగాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అడవిపందుల బెడద నుంచి పంటను కాపాడుకోవడానికి తీసిన విద్యుత్ తీగకు తగిలి చిరుతపులి మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన దేవిరెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి అడవి పందుల నుంచి శనగ పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడన్నారు. నాలుగు రోజుల క్రితం అటుగా వచ్చిన చిరుతపులి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిందన్నారు. అయితే రైతు చిరుతపులిని సమీపంలోని కొండలో పూడ్చిపెట్టాడని అన్నారు. దీనికి సంబంధించి తమకు సమాచారం రావడంతో బుధవారం రైతును వెంట తీసుకుని సంఘటన స్థలానికి చేరుకుని చిరుత మృతకళేబరాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామన్నారు. కాగా.. ఈ ప్రాంతంలో చిరుతపులి సంచారం ఇదే మొదటిసారి అని స్థానికులు తెలిపారు. తమ పొలాలకు అడవిపందుల బెడద ఎక్కువగా ఉందని, చిరుత సంచారం మాత్రం ఇప్పుడే వెలుగులోకి వచ్చిందని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



చందు (ఫైల్)

వల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండల పరిధిలోని రామిరెడ్డికొట్టాలు సమీపంలో కడప-తాడిపత్రి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చందు (18) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కమలాపురం వాసి చందు అదే కాలనీకి చెందిన రఘునాథ్, బాలు అతని స్నేహితులతో కలిసి సొంత పని నిమిత్తం కడపకు వెళ్లారు. పనిముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా రామిరెడ్డికొట్టాలు వద్ద గొర్రె అడ్డు రావడంతో బైకు అదుపు తప్పిందని, దీంతో బైకు వెనుక భాగంలో కూర్చుని ఉన్న చందు ఒక పక్కకు ఒరిగాడు. అదే సమయంలో కడప వైపు స్కూటరుపై వెళుతున్న వ్యక్తి బైకుతో ఢీకొట్టాడు. ఈప్రమాదంలో చందు తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్ చార్జ్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రసాద్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజిలో బీటెక్ చదువుతున్న వెన్నపూస అఖిల (22) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం సి.చిక్కేపల్లి గ్రామానికి చెందిన పి.చెన్నారెడ్డి, రమణమ్మల చిన్న కుమార్తె అయిన అఖిల బీటెక్ (సీఎస్ఈ) చివరి సంవత్సరం చదువుతోంది. ప్రైవేటు హాస్టల్లో ఉంటున్న అఖిల బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో తన గదికి గడియ పెట్టుకుని చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కొందరు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గదిలోని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకుగల కారణాలు తెలియరాలేదు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు రాజంపేటకు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో చెలరేగిన మంటలు

● ఇంటి సామాగ్రి దగ్ధం ● రూ.లక్షల ఆస్తినష్టం

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిజ్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోయిన ఘటన బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజకాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. త్యాగరాజు కాలనీలో నివాసం ఉంటున్న వనిపెంట వెంకటసుబ్బమ్మ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంట లు చెలరేగాయి. దీంతో స్థానికులు అదుపు చేసేందుకు ప్రయత్నించి ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించగా, ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసే లోపే ఇంటిలోని విలువైన సామాగ్రి అంతా కాలిపోయింది. దీంతో ఇంట్లో మనవరాలి పెళ్లికోసం తెచ్చి పెట్టుకున్న బంగారు నగలు, పట్టుచీరలు, ఫ్రిజ్, టీవీ, బీరువాలోని బట్టలన్నీ కాలిపోయాయి. ఈఘటనలో దాదాపు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోతున్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో బుధవారం సాయంత్రం తూగుట్లపల్లె చెన్నప్ప (37) అనే వ్యక్తి ఇంటిలో ఫ్యానుకు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల వివరాల మేరకు... చెన్నప్ప డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పాలెం గ్రామానికి చెందిన వరలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. సంక్రాంతి పండుగకు గూడెం చెరువు వద్ద నుంచి అమ్మగారి ఇంటికి వెళ్లిన వరలక్ష్మి తిరిగి రాలేదు. దీంతో మనస్థాపం చెందిన చెన్నప్ప ఇంటిలో తల్లి పుల్లమ్మతో గొడవపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ లింగప్ప పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో చోరీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధి నాగులకట్ట వీధిలోని చౌడేశ్వరీదేవాలయంలో బుధవారం చోరీ జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి గుడిలో ఉన్న అమ్మవారి నాలుగు వెండి హస్తాలు (600 గ్రాములు), శఠారి 400 గ్రాములు, తాళిబొట్టు అరతులం చోరీ చేశారని ఆలయ అధ్యక్షుడు జి.తిరుమలదాసు అర్బన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు : జేసీ

వేంపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోడౌన్లలో డీలర్లకు అందించే బియ్యం బస్తాల్లో, రేషన్‌షాపుల్లో ప్రజలకు ఇచ్చే తూకాల్లో మోసం జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హెచ్చరించారు. తూకాల్లో తక్కువ రాకుండా తనిఖీ చేపట్టాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్, ఇతర అధికారులను ఆదేశించారు. వేంపల్లె బియ్యం గోడౌన్‌ను జేసీ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం చింతలమడుగుపల్లె వద్ద రేషన్ ఎండీయూ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం కత్తలూరు పంచాయతీలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



బియ్యం గోడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

రీసర్వే పక్కాగా చేపట్టాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న రీసర్వే పనులను కచ్చితత్వం వుండేలా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. కొండూరు, చీమలపెంట గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను బుధవారం జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ జంబోరి వేడుకల్లో స్కౌట్ విద్యార్థుల ప్రతిభ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరుచురాపల్లిలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించిన స్కౌట్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకల్లో పాల్గొని ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్ విద్యార్థులను బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు. జంబోరి వేడుకల్లో ప్రతిభ చూపి ఎస్పీ ద్వారా అభినందనలు పొందిన వారిలో సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తరుణ్ కుమార్‌గౌడ్, వీరవెంకటప్రణీత్, నాగచైతన్యరెడ్డి, వెంకటేశ్వర, శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన విద్యార్థులు జాతీయ జంబోరి వేడుకల్లో పాల్గొని ప్రతిభ చూపి జిల్లాకు పేరు తేవడం గర్వకారణంగా ఉందన్నారు. జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతీయ జంబోరి అనేది విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరైన ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఫుడ్ ఎగ్జిబిషన్, మార్చ్‌పాస్ట్, యోగా, క్యాంపు ఫైర్ తదితర విభాగాల్లో మన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. అనంతరం డీఆర్‌వో మధుసూదన్‌రావు, డీఈవో సుబ్రమణ్యం, డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ నితిన్‌రెడ్డి, నోబెల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన స్కౌట్ విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

10 నుంచి హరిహరక్షేత్రం బ్రహ్మోత్సవాలు



చెన్నకేశవస్వామి ప్రధాన దేవాలయం



వల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడికాల్వ గ్రామంలో పవిత్ర పాపాఘ్నినది తీరాన వెలసిన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాలను 10వ తేదీ నుంచి వేడు కగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ తెలిపారు. 10న ఉదయం రాక్షసోఘ్న హోమం, వాస్తు హోమాలు, అఘోరరుద్ర, భాద్ర పారాయణాలు, లలితా లక్ష్మి విష్ణు సహస్ర పారాయణం చేస్తామన్నారు. 11న మంగళవారం చండీహోమం, మహామృత్యుంజయహోమం, లక్ష్మీనారాయణ హృదయ హోమం, సువర్చలాదేవి సమేత హనుమాన్‌హోమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు సుబ్రమణ్యహోమం, నాగశాంతి, పరిహార అశ్లేష బలి నిర్వహించి మహామంగళహారతి నిర్వహిస్తామన్నారు. 12న బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా సీతల ఇంద్రాక్షి హోమాలు, ఏకాదశ రుద్ర, సంకల్పిత హోమాలను నిర్వహించి.. మహా పూర్ణాహుతి అనంతరం స్వామివారికి కుంభాభిషేకం ఉం. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నసంతర్పణ వుంటుందని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా కాలక్షేపం ఉంటాయన్నారు.

న్యాయసేవలను విస్తరింపచేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, ఫిబ్రవరి 5: జాతీయ న్యాయసేవాధికార సంస్థ(నల్సా) అందిస్తున్న పథకాలను, న్యాయసేవలను విస్తరింపచేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సభ్యులకు సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నల్సా వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు 1987, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయచట్టం 2015, ఉచిత, నిర్బంధ విద్యకోసం పిల్లల హక్కు చట్టం 2009 తదితర వాటిని తెలుసుకుని వాటిని ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సీనియర్ సిటిజన్స్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు నుంచి కుంభమేళాకు ఆర్టీసీ బస్ టూర్

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నుంచి కుంభమేళాకు ఆర్టీసీ బస్ టూర్‌ను ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ బస్సు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు బస్సు బయలుదేరుతుందన్నారు. అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, పూరి, గయా, బుద్ధగయ, అయోధ్య, వారణాసి, ప్రయాగ తిరిగి పిఠాపురం, సామర్లకోట, విజయవాడ మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంటుందన్నారు. ఈ టూరు పది రోజులు ఉంటుందని ఆ సమయంలో టూరిస్టులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఒక వ్యక్తికి రూ.13500 ధర నిర్ణయించడం జరిగిందన్నారు. టూరుకు రాదల్చినవారు టికెట్ బుకింగ్, మరింత సమాచారం కోసం 7382866916, 9966525210, 7382867512 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాయలసీమలో అత్యంత విలువైన వారసత్వ సంపద

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్



విద్యార్థులతో వీసీ విశ్వనాథ్‌కుమార్, ఇంటాక్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో అత్యంత విలువైన వారసత్వ సంపద ఉందని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. నేటితరం బాలలకు వారసత్వ సంపద విలువ పట్ల అవగాహన కల్పిస్తేనే దాన్ని రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఇంటాక్ ఆధ్వర్యంలో నగరానికిచెందిన విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో అపురూపమైన వారసత్వ సంపద ఉందని, అందులో మనదేశం ఏమాత్రం తక్కువ కాదని, ప్రధానంగా రాయలసీమలో కూడా ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందన్నారు. దీనిపై అవగాహన కలిగినప్పుడే ఆ సంపదను రక్షించుకోవాల్సిన అవసరం గురించి తెలుస్తుందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ టీవీ సుబ్బారెడ్డి, సభ్యులు కె.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, టెక్నికల్ విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా శనగ పంట దున్నేశారు

● న్యాయం చేయాలని రైతు ఎస్.నాగసుబ్బారెడ్డి వినతి



దున్నిన శనగ పంటను చూపుతున్నరైతు నాగ సుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో సాగు చేసిన శనగ పంటను ఓ వ్యక్తి దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్నేయడంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు ఎస్.నాగుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన నాగసుబ్బా రెడ్డి జమ్మలమడుగులో బుధవారం సాయంత్రం విలేకరుల ఎదుట జరిగిన నష్టానికి సంబంధించి తెలిపారు. పెద్దపసుపుల గ్రామంలో సర్వే నంబరు 115/1లో తాను 4.23 ఎకరాల్లో శనగ పంట సాగు చేశానన్నారు. ఐదు రోజుల్లో కోత పెట్టాల్సి ఉంది. అంతలోపు శెట్టిపల్లె శ్రీరామరెడ్డి తన పంట పొలంలోకి ట్రాక్టర్ తీసుకొచ్చి దౌర్జన్యంగా దున్నేశారన్నారు. దీంతో తనకు దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ విషయం పెద్దముడియం పోలీసులకు తెలియజేశానన్నారు. మూడు రోజుల నుంచి జమ్మలమడుగు పోలీసు స్టేషన్, రూరల్ సీఐ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరుగలేదని వాపోయాడు. గత అయిదు సంవత్సరాల నుంచి పొలం తగాదా ఉందని.. తమకు న్యాయం చేయాలని బుధవారం సాయంత్రం వెళితే ఎవరూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశాడు. ఈ విషయంపై పెద్దముడియం ఎస్ఐ సుబ్బారావును వివరణ కోరగా.. బాధిత రైతు ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు చేయలేదని.. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

వెల్లటూరులో జర్మన్ బృందం పర్యటన

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



రైతులతో మాట్లాడుతున్న విదేశీ ప్రతినిధుల బృందం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జర్మన్ దేశానికి చెందిన జాతీయ బ్యాంక్ కేఎఫ్‌డబ్యూ ప్రతినిధుల బృందం బుధవారం వెల్లటూరు గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. బృంద సభ్యులు రైతు హరిప్రియ పొలంలో విత్తన గుళికల విధానాన్ని ఉపయోగించి వేసిన అలసంద పంట ప్రయోగాత్మక ప్లాట్‌ను పరిశీలించి ప్రయో జనాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు విత్తిన గుళికల తయారీ విధానాన్ని డెమో పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రైతుసాధికారిక సంస్థ సీనియర్ అధికారులు మురళీధర్ ఏఓ శివారెడ్డి, డీపీఎం ప్రవీణ్ కుమార్, అదనపు డీపీఎం వసంత కుమారి, విదేశీ బృంద సభ్యులు మార్క్ ఫ్రెయిన్, సర్వీ నాబుయర్స్, సంగీత అగర్వాల్, అన్నా బెరెజోవ్ స్కాజా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా ఆచార్య ఏజీ దాము



నియామకపత్రాన్ని అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దామును ఫ్యాకల్టీ ఆఫ్‌సైన్సెస్ డీన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య ఏజీ దాముకు ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఇది వరకు డీన్‌గా పనిచేస్తున్న ఆచార్య కృష్ణారెడ్డి పదవీకాలం పూర్తికావడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత, సహ ఆచార్యులు డాక్టర్ వెంకటరామ్ పాల్గొన్నారు.

శివాలయం హుండీ కానుకలు లెక్కింపు

చిట్వేలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయం, బ్రాహ్మణ వీధిలోని భక్తాంజనేయ స్వామి ఆలయాల హుండీల్లోని కానుకల ను బుధవారం అధికారులు ఆలయ కమి టీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. శివా లయంలో 4,01,430 రూపాయలు భక్తాం జనేయ స్వామి ఆలయంలో 32,475 రూ పాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో కొం డారెడ్డి తెలిపారు.

శేష వాహనంపై దేవదేవుడి విహారం

● రెండో రోజు వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు ● నేడు శ్రీవారికి ముత్యపు పందిరి వాహనం, సింహవాహన సేవలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజైన బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత అలంకార భూషితులైన శ్రీవారికి ఉదయం శేషవాహనం, రాత్రి హంస వాహన సేవలు వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున వేదపండితులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం 8 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేతులైన వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన శేషవాహనంపై కొలువు దీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారు హంసవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సేవ అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో కొలవుదీర్చి పాలు, పెరుగు, తేనే, పసుపు, కొబ్బరినీళ్ల, చందనంతో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామివారు హంస వాహనంపై కొలువు దీరి పూజలందుకున్నారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమివ్వగా, భక్తులు అశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో బాగంగా గురువారం ఉదయం శ్రీవారికి ముత్యపుపందిరి వాహనం, రాత్రికి సింహవాహన సేవలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశాంత్‌కుమార్, వేదపండితులు కృష్ణప్రసాద్ బట్టర్, రమేశ్‌స్వామి, సిబ్బంది నగేష్, టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరి శీను, సోమశేఖర్, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శేషవాహనంపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు

రోడ్డు ప్రమాదాలను నివారించండి

● జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసుశాఖ, రోడ్డు రవాణా శాఖ అధికారులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద జెండా ఊపి రోడ్డు భద్రతా ర్యాలీని డీటీవో ప్రసాద్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో పోలీసు శాఖ, మదనపల్లె ఆర్టీసీ, మోటర్ వెహికల్ శాఖ అధికారులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్లకార్డులు చేతపట్టిన విద్యార్థులు, అధికారులు 'అతివేగం ప్రాణానికే ప్రమాదకరం, వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పకుండా వాడాలి, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని' ర్యాలీలో నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వాహనాలను నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడరాదని, వాహనాలకు ఎప్పటికప్పుడు ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్ తప్పక చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దినేష్‌చంద్ర, ఆర్టీవో అశోక్ ప్రతాప్‌రావు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివలింగయ్య, శ్రీహరి, ట్రాఫిక్ సీఐ మోహన్‌కుమార్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు మోహన్‌వల్లి, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నేతల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట బుధవారం ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యదర్శి సలీంబాషా, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చాలని యత్నిస్తోందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మహబూబ్‌బాషా, నారాయణ స్వామి, ఆటో యూనియన్ నాయకులు రాము, ఆదినారాయణ, నవీన్, రైతు సంఘం నాయకులు మల్లికార్జున, శివన్న, యల్లప్ప, వెంకటరమణ, సుబ్బన్న, శంకరమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో విచారణ


ఆలయంలో విచారణ చేస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం జిల్లా దేవదాయశాఖాధికారి విశ్వనాథ్ విచారణ నిర్వహించారు. గతంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డెప్పరెడ్డి ఆలయంలో పిరమెండ్ తొగించారని, పూజారి వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నారని భక్తులు ఫిర్యాదు చేయడంతో ఈ రోజు ఆ విషయంగా విచారణ చేపట్టి నివేదికను సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జర్మన్‌రాజు, హేమంత్, భగవాన్, శివమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

కురబలకోట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని వైస్ ప్రిన్సిపల్ కమాల్‌బాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలో గల మిట్స్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మరణిస్తున్నారని, అలాంటి వారికి ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా 108 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్‌రెడ్డి, మహేష్, డాక్టర్ చెన్నయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కురబలకోట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జంగావారిపల్లె రహదారిపై కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపిస్తూ నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బడ్జెట్ రైతులను, పేదలను దగా చేసిందని ఆరోపించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ తపస్వినికి అందజేశారు.

మానవహక్కుల కార్యదర్శిగా సల్మా


జాతీయ మానవహక్కుల కార్యదర్శిగా ఎంపికైన సల్మా

రామసముద్రం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణం కేబీఎస్ వీధికి చెందిన ఎంఏ సల్మాకు జిల్లా జాతీయ మానవహక్కుల విభాగం నేర నియంత్రణ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు వరించాయి. బుధవారం మండలానికి విచ్చేసిన సల్మా మీడియాతో మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం పాటుపడతానని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా పనిచేస్తానని ఆమె అన్నారు.

బహుళ అంతస్థులపై..

పంచాయతీ అధికారుల 'నజర్'

● వారంలో నివేదికలు అందించాలని సర్క్యులర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'పంచాయతీల్లో పుట్టగొడుగుల్లా బహుళ అంతస్థుల భవనాలు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. మదనపల్లె డివిజన్‌లోని 15 మండలాల్లో గ్రామ పంచాయతీల్లో బహుళ అంతస్థుల భవనాలు ఎన్ని వున్నాయి ? ఎన్నిటికి అనుమతి వుంది ? లేని వాటిపై ఏమి చర్యలు తీసుకున్నారో నివేదించాలని డీఎల్‌పీవో నాగరాజు సర్క్యులర్ జారీ చేశారు. బుధవారం డీఎల్‌పీవో మాట్లాడుతూ మేజర్ పంచాయతీలు, పట్టణ శివారుల్లోని గ్రామ పంచాయతీల్లో బహుళ అంతస్థుల భవనాల వివరాలు, పంచాయతీ చెల్లిస్తున్న ఇంటి పన్ను, లేని వాటిపై ఏం చర్యలు తీసుకున్నారో ఈ నెల 12వ తేది లోపు నివేదించాలని పంచాయతీ కార్యదర్శులు, అన్ని మండలాల ఈవోఆర్డీలకు సర్క్యులర్ పంపామన్నారు. అంతేకాకుండా ఈ నివేదికలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే సదరు పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎల్‌పీవో చెప్పారు.

కేంద్ర పథకాల అమలుపై సెంట్రల్ కమిటీ ఆరా

కలికిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ పథకం క్షేత్ర స్థాయిలో అమలవుతున్న తీరుతెన్నుల గురించి బుధవారం పరిశీలించింది. స్థానిక సీహెచ్‌సీలో పలు కార్యక్రమాల గురించి ఆరా తీశారు. డాక్టర్ పర్వీన్ సుల్తానా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రికార్డులు పరిశీలించారు. తల్లి బిడ్డ సంరక్షణ, కుటుంబ ఆరోగ్య పథకం తదితర కార్యక్రమాలకు సంబంధించి తనిఖీలు నిర్వహించారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల యూనిట్‌ను పరీక్షించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫిజియోథెరపీ యూనిట్ సేవలు ప్రజలకు మరింత విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల కోసం నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర వైద్య పథకాలను, సేవలను ప్రజలకు అందుబాటులో వుంచిన వివరాలను సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్, డీపీవో డాక్టర్ వెంకటేష్, సీహెచ్‌సీ వైద్యులు ఆశాలత, అన్వేష్, ఫిజియోథెరపిస్ట్ మురళి, నర్సింగ్ ఇన్‌చార్జి హెడ్ వనజ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పర్వీన్

12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి


హెడ్‌పోస్టాఫీసు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రాజెక్టు కార్యదర్శి మధురవాణి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు రాజేశ్వరి, రాణి, సుమతి, రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.95 లక్షలతో ప్రహరీగోడ మంజూరు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల కస్తూర్బా బాలికల విద్యాలయానికి రూ.95 లక్షలతో ప్రహరీగోడ మంజూరైనట్లు ఎస్‌వో మునివెంకటమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పాఠశాల నిర్మించినప్పటి నుంచి ప్రహరీ గోడ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గుర్తించి పాఠశాల ప్రహరీగోడ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతులమీదుగా భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

8న ధర్మపథంలో మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహాలయంలో ఈ నెల 8న విశేష పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. శనివారం ఉదయం శని భగవానుడికి ఏకవార మహారుద్రాభిషేకం, మహాతైలాభిషేకం, ప్రత్యేక పూజలు జరగనున్నాయని, భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామి పాత్రులు కాగలరని కోరారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్‌వోబీ సిబ్బందిపై దుకాణదారుల ఆగ్రహం


ఆర్‌వోబీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దుకాణదారులు

పీలేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం ఎల్‌బీఎస్ రోడ్డులో నిర్మితమవుతున్న ఆర్‌వోబీ కాంట్రాక్టు సంస్థ సిబ్బందిపై బుధవారం స్థానిక దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు ప్రతి రోజూ నాలుగుసార్లు నిర్మాణ ప్రాంతంలో నీళ్ల పట్టి దుమ్ము రేగకుండా చూడాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని దుకాణదారులు ఆరోపించారు. తాము పలుమార్లు విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోవడం లేదని, నిరంతరాయంగా రేగుతున్న దుమ్ము కారణంగా తాము అటు ఆర్థికంగా, ఇటు ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నామని వారు వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వీలైనంత త్వరగా ఆర్‌వోబీ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

వికలాంగ పింఛన్ల పరిశీలన


పింఛన్ లబ్దిదారులను పరిశీలిస్తున్న వైద్యుడు

పీలేరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న వికలాంగ పింఛన్ల పరిశీలనను పీలేరులో బుధవారం అధికారులు ప్రారంభించారు. రూ.6 వేలు పింఛన్ అందుకుంటున్న లబ్దిదారులను రోజుకు 50 మంది చొప్పున పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. రోజుకు 50 మంది చొప్పున ఈ నెల 28వ తేదీ వరకు పీలేరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో రాయచోటి ఏరియా ఆసుపత్రికి చెందిన వైద్యులు డా.షేక్ రాజా అహ్మద్ లబ్దిదారులను పరిశీలించడమే కాకుండా వారి సర్టిఫికెట్లను కూడా విచారిస్తారన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న దళిత నాయకులు

రామసముద్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినికి పంచాయతీ బూడిదపల్లె గ్రామంలో రామసముద్రం మండల సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు జయరాజ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ ఉపాధ్యక్షులు అరికెల రామాంజులు, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజి, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వన్‌డిపో ఎన్‌ఎంఏ కార్యవర్గం ఎన్నిక

● డిపో అధ్యక్ష, కార్యదర్శులుగా రమణ, రెడ్డిబాషా

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక దేశాయ్ ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె వన్ డిపో జనరల్ బాడీ సమావేశం బుధవారం జిల్లా కార్యదర్శి పీఎస్‌ఎం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కడప జోనల్ సెక్రటరీ చెన్నారెడ్డి, రాష్ట్ర సీసీఎస్‌ఎంసీ మెంబర్ వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఏ క్యాడర్‌కు ప్రమోషన్లు లేవన్నారు. ఆర్టీసీలో సిబ్బంది కొరత అధికంగా ఉందని, అన్ని విభాగాల్లో ఖాళీలను పూర్తిగా భర్తీ చేయాలన్నారు. సమావేశం అనంతరం వన్ డిపో ఎన్‌ఎంయూ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అందులో డిపో అధ్యక్షుడుగా వీవీ రమణ, కార్యదర్శిగా రెడ్డిబాషాలను ఎన్నుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు నూతన కమిటీ సభ్యులను పూలమాల వేసి దుశ్శాలువా కప్పి సన్మానించారు.

ప్రజాసంఘాల రాస్తారోకో

మదనపల్లెఅర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక పేదలను దగా చేసే బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పోస్టాఫీస్ వద్ద అనిబిసెంట్ సర్కిల్ వద్ద ఏపీ రైతు వ్యవసాయ, కౌలురైతుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో చేపట్టారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్ రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పటేల్ రోడ్డు, బెంగళూరు రోడ్డు ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను దగా చేసేదిగా ఉందని వివరించారు. రాష్ట్ర రాజధానికి నిధులు కేటాయించకుండా మరోసారి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకులు నారాయణ, పవన్, రాజశేఖర్, రెడ్డిప్రసాద్, చాంద్‌బాషా, రామకృష్ణ, చలపతినాయుడు, రాజు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం కలకలం

మదనపల్లెఅర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం తట్టివారిపల్లె చెరువులో మృతదేహం కలకలం చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం స్థానికులు నడిచెరువులో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఈ కేసు తమ పరిధిలోకి రాదంటే.. తమ పరిధిలోకి రాదంటూ తాలుకా పోలీసులు, టూటౌన్ పోలీసులు మిన్నకుండిపోయారు. చెరువు మధ్యలో ఈ సంఘటన జరగడంతో సమస్య తలెత్తింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పీలేరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం మిన్నమరెడ్డిగారిపల్లెలో జరుగుతున్న ఉచిత కంటి పొర శస్త్రచికిత్స శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. మిన్నమరెడ్డిగారిపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో చెన్నైలోని శంకర్ నేత్రాలయ వైద్యుల పర్యవేక్షణలో ఈ నెల 2వ తేదీన వైద్య శిబిరం ప్రారంభమైంది. ఆ రోజు నుంచి బుధవారం వరకు 400 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి 71 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించి 23 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా పూర్తి చేశారని నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు శిబిరం ఉంటుందని, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక


రాజగోపాల్ రెడ్డి, శంకరయ్య

పీలేరు, ఫిబ్రవరి 5(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఏపీఎస్‌జీఆర్ఈఏ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం పీలేరులో జరిగింది. పీలేరులోని పెన్షనర్ల భవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చెంగారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఈ ఎన్నికలో పీలేరుకు చెందిన ఆర్.రాజగోపాల్‌రెడ్డి జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వి.శంకరయ్య, కోశాధికారిగా పి.జగన్మోహన్, సహాధ్యక్షులుగా ఎస్.రామచంద్రయ్య, పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా యూసుఫ్ సాహెబ్, ఎం.రాజగోపాల్, జయరాం, ఎస్వీ రమణ, కార్యదర్శులుగా నిర్మలాదేవి, సయ్యద్ అమీర్, రామానుజమ్మ, వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సీతారామయ్య, దేవేంద్ర ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని పీలేరు నియోజకవర్గంలోని పలువురు అభినందించారు.

హృద్రోగులకు వరం 'స్టెమీ' కార్యక్రమం

పీలేరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్టెమీ' కార్యక్రమం హృద్రోగులకు వరం లాంటిదని పీలేరు ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. తమ వైద్యశాలలో బుధవారం ఆయన స్టెమీ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండెపోటు కారణంగా చాలా మంది అకాల మరణం చెందుతున్నారని, గుండెపోటు లక్షణాలు తెలిసిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదిస్తే స్టెమీ కార్యక్రమం ద్వారా వారి ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. రూ.45 వేలు విలువజేసే 'టెనెక్టప్లస్' ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వేస్తారన్నారు. ఫిబ్రవరి 2023 నుంచి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 మందికి 'టెనెక్టప్లస్' ఇంజెక్షన్లు వేసి ప్రాణాలు నిలిపామన్నారు. ప్రస్తుతం వారందరూ సుఖంగా జీవిస్తున్నారన్నారు. అనంతరం స్టెమీ కార్యక్రమ నోడల్ అధికారిణి డా.నాగవేణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో సరస్వతమ్మ, ఏవో భాస్కర, సిబ్బంది శివప్రసాద్, పరీఫ్ జాన్, శారద, ఇందుమతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వాల్మీకిపురం: గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు స్టెమీ చికిత్స భరోసా కలిగిస్తుందని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండటం, గుండె దడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలు ఉన్నట్లయితే తక్షణం అప్రమత్తం కావాలన్నారు. అనంతరం కరపత్రాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ స్టెమీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సోని, డాక్టర్లు హర్షితారెడ్డి, శివాని, శ్రీలక్ష్మి, ఆసీఫ్, మమత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.